
BALA CHELIMI

BALA




OCT 2024

October

₹40

అక్టోబర్ - 2024

# బాల చెలిమి

పిల్లల వికాస పత్రిక

# BALA CHELIMI

Telugu Children's Monthly Magazine

సంపుటి : 34 • సంచిక : 1

OCTOBER - 2024



Kashmiri Dance : From the Land of purple mountains glaciers and chiamo trees.

Editor : Er. VEDAKUMAR MANIKONDA

A PUBLICATION OF CHILDREN'S EDUCATIONAL ACADEMY, HYDERABAD, TELANGANA

# చిల్డ్రన్స్ ఎడ్యుకేషనల్ అకాడమీ

హైదరాబాద్ (Regd. 720/1982)

బాల చెలిమి

పిల్లల వికాస పత్రిక

## తెలంగాణ బడి పిల్లల కథలు



**10 పుస్తకాల సెట్ ధర రూ.330 • తగ్గింపు ధర రూ. 300**

పిల్లలకు అత్యంత ఆనందానిచ్చేది ఆట బొమ్మలు, కథల పుస్తకాలే. పాఠ్యపుస్తకాలు అందించే జ్ఞానానికి సమాంతరంగా మరెంతో లోకజ్ఞానాన్ని అందించేది బాల సాహిత్యమే. పుస్తకాలు పిల్లల ఆలోచనా నైపుణ్యాలను పెంచుతాయి. వారి ఊహలకు ప్రాణం పోస్తాయి. వారిలో సృజనాత్మకతను పెంచుతాయి. చరిత్ర, సంస్కృతి, కళలు, సైన్స్, మానవ స్వభావాలు, జంతు స్వభావాలు, ఆరోగ్య సంబంధిత అంశాలు - ఒకటేమిటి ప్రాథమిక విజ్ఞానఖని బాలసాహిత్యం, పిల్లలో నైతికతను, ఆధ్యాత్మికతను, సక్రమమైన ప్రవర్తనను, మంచి చెడుల అవగాహనను పెంచే బాధ్యతను బాలసాహిత్యమే నెరవేర్చగలదు.

ఇవి అచ్చంగా మన పిల్లలు రాసిన కథలు, స్వచ్ఛమైన కథలు. 'చిల్డ్రన్స్ ఎడ్యుకేషనల్ అకాడమీ' తెలంగాణలోని ఉమ్మడి 10 జిల్లాల **"బడి పిల్లల కథలు"** సంకలనాలుగా అందమైన బొమ్మలతో గతంలో వెలువరించింది. అవి రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ విశేష ఆదరణ పొందాయి.

అలాగే ఇప్పుడు పిల్లలకోసం తెలంగాణలోని ఉమ్మడి పది జిల్లాల బాల సాహిత్య రచయితలు రాసిన **"పెద్దలు రాసిన పిల్లల కథలు"** పది సంకలనాలను అందమైన బొమ్మలతో వెలువరించింది. చిన్నారులు, పెద్దలు, సాహితీ వేత్తలు ఎప్పటివలె ఈ పుస్తకాలను ఆదరిస్తారని ఆశిస్తున్నాం.

-మణికొండ వేదకుమార్

చైర్మన్, చిల్డ్రన్స్ ఎడ్యుకేషన్ అకాడమీ

## పెద్దలు రాసిన పిల్లల కథలు (ఉమ్మడి పది జిల్లాలు)



**10 పుస్తకాల సెట్ ధర రూ.350 • తగ్గింపు ధర రూ. 300**





### ప్రతులకు

అన్ని ప్రముఖ పుస్తక కేంద్రాలు. మరియు

'భూపతి సదన్' 3-6-716, స్ట్రీట్ నెం.12,

హిమాయత్‌నగర్, హైదరాబాద్-500029

ఫోన్ : 9030 6262 88

*email: edit.chelimi@gmail.com website : www.balachelimi.com*

## చిల్డ్రన్స్ ఎడ్యుకేషనల్ అకాడమీ ప్రచురించిన ఇతర పుస్తకాలు



బాల చెలిమి

పిల్లల వికాస పత్రిక

# BALA CHELIMI

Telugu Children's Monthly Magazine

సంపుటి: Volume: **34** | సంచిక : Issue : **1** | హైదరాబాద్ Hyderabad | అక్టోబర్ October | పేజీలు Pages **52** | రూ. ₹. **40**


## లోపలి పేజీల్లో.......











| | | |
|---|---|---|
| మనిషిని మనిషిని కలిపి ఉంచేందుకే ఈ పండుగలు... | మణికొండ వేదకుమార్ | 5 |
| జీవంలేని వస్తువుతో మాట్లాడించిన మార్కొని (సైంటిస్ట్) | జుగాష్‌విలి | 6 |
| జాతీయ తపాల దినోత్సవం (పోస్టల్ డే) | డా. నీరజ అమరవాది | 7 |
| 'మాయాలోకం'లోకి పిల్లలందరికీ, పెద్దలకూ ఆహ్వానం | పుస్తక పరిచయం | 8 |
| టెస్సీ థామస్ | షిరోస్-256 | 9 |
| గుణింతాల గుణగణాలు - 1 (అక్షరం) | వై. మల్లికార్జున రావు | 10 |
| చేపల కాపలా (కథ) | సంగనభట్ల చిన్న రామకిష్టయ్య | 11 |
| చదరంగం పుట్టిన దేశం అయిన చెస్ ఒలింపియాడ్లో స్వర్ణ చరిత్ర సృష్టించిన భారత్ (చెస్) | ఓజిఎస్ స్పోర్ట్స్ అకాడమీ | 13 |
| భయం (కథ) | యం. రాం ప్రదీప్ | 14 |
| గుజ్జెన గూళ్ళు (ఆట) | చిన్ననాటి ఆటలు - జ్ఞాపకాల మూటలు | 15 |
| మంచి మిత్రులు (కథ) | చనగాని సాత్విక | 16 |
| వృక్ష క్షేత్రం మరికల్ మర్రి (విహార స్థలాలు) | డా. ద్యావనపల్లి సత్యనారాయణ | 17 |
| హంసలు (కథ) | లియో టాల్ స్టాయ్ | 18 |
| ఆటోమేషన్ పై విశ్లేషణ (ఐటి) | కార్తీక లక్ష్మీ | 19 |
| చదువు (నాటిక) | డా॥ కాసర్ల నరేశ్‌రావు | 20 |
| కోతి మొసలి కథ | పంచతంత్ర కథ | 24 |
| అందాల సెలయేరు (కవిత) | గద్వాల సోమన్న | 24 |
| జమ్మి చెట్టు (చెట్టు - చేమ) | కోమటిరెడ్డి బుచ్చిరెడ్డి | 25 |
| ధైర్య సాహసే (కార్టూన్) | శారద | 26 |
| వారాలు (పాట) | పిల్లల పాటల పరిమళం | 28 |
| గింజలు (పాటలు) | పిల్లల పాటల పరిమళం | 28 |
| ఇవాన్ (కథ) | అనిల్ బత్తుల | 29 |
| శబ్దవేధి (సైన్స్) | డాక్టర్ మహీధర నళినీ మోహన్ | 31 |

| | | |
|---|---|---|
| ప్రాణ స్నేహితులు (కథ) | హిందు | 32 |
| కూరగాయలు (శాస్త్రీయ నామం) | ఆరోగ్యం – విజ్ఞానం | 34 |
| టార్డిగ్రేడ్ (జంతువు) | సచిన్ కోత్వాల్ | 35 |
| చెలిమి క్లబ్ | బాలచెలిమి | 36 |
| బతుకమ్మ – దసరా (పండుగ) | డా. అమ్మిన శ్రీనివాసరాజు | 37 |
| నాభి (ఆరోగ్యం – విజ్ఞానం) | ఎం. దివ్య | 40 |
| నేర్చుకుందామా | | 41 |
| కలం చెలిమి | బాలచెలిమి | 41 |
| అసలు దయ్యం (కథ) | వురిమళ్ల సునంద | 42 |
| MS Office ఎలా నేర్చుకోవచ్చు (కంప్యూటర్ నైపుణ్యం) | బాలచెలిమి డెస్క్ | 44 |
| తెలంగాణ సారస్వత పరిషత్తు నిర్వహిస్తున్న బాలల సాంస్కృతికోత్సవం | | 44 |
| బంగ్లాపై భారత్ భారీ విజయం 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్– అశ్విన్' | ఓజీఎస్ స్పోర్ట్స్ అకాడమీ | 45 |
| రియల్ లీడర్... | రిసోర్స్ గూగుల్ | 46 |
| అంతర్జాతీయ, జాతీయ దినోత్సవాలు (జి.కె.) | సచిన్ కోత్వాల్ | 47 |
| బాలచెలిమి గ్రంథాలయంపై సమీక్ష | | 48 |
| సమాచారం | సచిన్ కోత్వాల్ | 49 |
| మోక్షగుండం విశ్వేశ్వరయ్య (వ్యక్తిత్వం) | సువేగా | 50 |

# చెలిమి లేఖలు

నాకు కథలు అంటే బాగా ఇష్టం. మా నాన్న పండ్ల వ్యాపారి, అమ్మ గృహిణి. మా ఉపాధ్యాయురాలు డాక్టర్ ఉప్పల పద్మ ప్రోత్సాహంతో కథలు చదవడమే కాదు రాయడం పట్ల ఆసక్తి పెంపొందించు కున్నాను. సమాజంలో నేను చూస్తున్న అంశాల పట్ల నాకు కలిగిన ఆలోచనలను కథలుగా మలిచాను. నేను రాసిన కథలను మా ఉపాధ్యాయురాలు వివిధ పోటీలకు కూడా పంపిస్తుంటారు. వివిధ పత్రికలలో నేను రాసిన ఎన్నో కథలు అచ్చయ్యాయి.

**– ఎస్. కె. నౌషీన్**

పదవ తరగతి, జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల
మిర్యాలగూడ, నల్గొండ జిల్లా.

నాకు పుస్తకాలు, కథలు చదవడం అంటే చాలా ఇష్టం. బాలచెలిమి మాసపత్రిక మా గ్రంథాలయానికి వస్తుంది. మా తెలుగు ఉపాధ్యాయుడు మీసాల సుధాకర్ గారి శిక్షణలో నేను కథలు రాసాను. అవి గులాబీలు, ఆదర్శ బాలల కథల పేరుతో పుస్తకంగా వచ్చింది. వివిధ పత్రికల్లో కూడా నా కవితలు ప్రచురితం అయ్యాయి.

**– ఎ. ప్రణవి**

10వ తరగతి, తెలంగాణ ఆదర్శ పాఠశాల, బచ్చన్నపేట, జనగాం

నా పేరు అక్షిత నేను 10వ తరగతి చదువుతున్నాను. మాకు రవి సార్ వ్యాస రచనలు, ఉత్తరాలు, కథలు, కవితలు ఎలా రాయాలో నేర్పించడం జరిగింది. కవిత పోటిలో, కార్యశాలలో మమ్మల్ని పాల్గొనేలా ప్రోత్సహించారు.

**– వి. అక్షిత**

10వ తరగతి, సిరిసిల్ల

*OGS Student's Pic :*
టి. స్వామి

*బొమ్మలు:*
కూరెళ్ల శ్రీనివాస్
m : 98495 43728




**సంపాదకులు : మణికొండ వేదకుమార్**

BALA CHELIMI
**"CHANDRAM"** 3-6-712/2, St.No.12, Himayatnagar,
Hyderabad - 500 029.
e-mail : edit.chelimi@gmail.com, www.balchelimi.com
Mob: 98480 44713

# మనిషిని మనిషిని కలిపి ఉంచేందుకే ఈ పండుగలు

అయ్య వారికి చాలు ఐదు వరహాలు. పిల్లలకు చాలు పప్పు బెల్లాలు. ఈ పాట ఎప్పుడైనా విన్నారా పిల్లలూ... మా చిన్నప్పుడు దసరా పండుగ తొమ్మిది రోజులూ ఉపాధ్యాయునితో కలిసి పిల్లలందరం ప్రతి విద్యార్థి ఇంటికి వెళ్లి ఈ పాట పాడేవాళ్లం. ఆ విద్యార్థి తల్లిదండ్రులు అయ్యవారికి కొంత డబ్బులు ఇచ్చి, పిల్లలకు మరమరాలు, శనగపప్పు, బెల్లం కలిపి పెట్టేవాళ్లు. ఆ సంబరం ఒక సంరంబంలా ఉండేది. దసరా పది రోజులూ ఊరు ఊరంతా కలివిడిగా అలాయిబలాయిగా ఉండేది. నిజానికి పండుగలు ఉన్నదే అందుకు. ప్రతి పండుగ వెనుకా ఎన్ని కథలు, విశ్వాసాలు ఉన్నప్పటికీ అన్ని పండుగలూ మనిషికి ప్రకృతికి ఉన్న సంబంధాలను, మనుషుల మధ్య ఉండవలసిన సంబంధాలను ఎప్పటికప్పుడు గుర్తు చేయడానికే.

ఇది వరుస పండుగల వేళ. దసరా, బతుకమ్మ, దీపావళి వెంట వెంటనే వస్తాయి. ఇది వర్షాకాలం ముగింపు, శీతాకాల ప్రారంభ సమయం. నిన్నటి దాకా కురిసిన వర్షాల వల్ల చెరువులు, కుంటలు తాజా నీటితో కలకలలాడుతుంటాయి. చెట్లూ చేమలు చిగురులు వేసి ప్రకృతి పచ్చగా ఉంటుంది. రంగు రంగుల పూలు ప్రకృతికి ఆభరణాల్లా అందానిస్తాయి. పూల సుగంధ పరిమళాలు గాలిని పరిశుభ్రంగానూ, ప్రశాంతంగానూ మారుస్తాయి. ఈ ప్రకృతి పరిణామాలు పర్యావరణ సామర్థ్యాన్ని పెంచుతాయి. ప్రకృతి శక్తికి ప్రతిరూపంగా మారుతుంది. ప్రకృతిని గౌరవించడానికి, అది ప్రసాదిస్తున్న సౌకర్యాలను, ఆనందాలను ఆస్వాదించడానికి ఈ పండుగలు తరతరాలుగా ప్రజలు జరుపుకుంటున్నారు. ఈ పండుగల వెనుక ప్రజలందరినీ ఏకం చేసే విశ్వాసాలతో పాటు, శాస్త్రీయ, వైజ్ఞానిక అంశాలు, సమాజ ప్రయోజనాలు ఉన్నాయి.



బతుకమ్మ మహిళలందరినీ ఒకటి చేసే పూల పండుగ. ఊరి ఊరినీ పూలతో, పాటలతో, ఆటలతో, నవ్వులతో ఆనందాల హరివిల్లుగా చేసే పండుగ. దసరా పండుగ పది రోజులూ నాటకాలు, కళా ప్రదర్శనలు, నృత్యాలు వంటి సాంస్కృతిక కార్యక్రమాలతో ఊరంతా ఒక చోటికి చేరుతుంది. అందరూ పాలపిట్టను దర్శించుకుంటారు. చివరి రోజు జమ్మి చెట్టు ఆకులు ఒకరికొకరు అందించుకుంటూ ఆలింగనాలతో స్నేహ మాధుర్యాన్ని పంచుకుంటారు. దీపావళి జీవితాల్లో వెలుగులు నింపే పండుగ. నిన్నటి వర్షాల వల్ల, వరదల వల్ల నీటి కాలుష్యం, వాతావరణ కాలుష్యం ఏర్పడతాయి. దోమలు, ఈగలు వంటి వాటివల్ల అంటువ్యాధులు ప్రబలుతాయి. ఈ కీటక నివారణకు దీపావళి నాడు వెలగించే బాణాసంచా దోహదపడుతుంది. ఇలా ప్రతి పండుగ వెనుక ఉన్న శాస్త్రీయ అవగాహనను అర్థం చేసుకోవాలి.

ప్రతి పండుగ మనిషిని ఆరోగ్యంతో, ఆనందంతో ఆహ్లాదపరచడానికే. మనిషిని మనిషిని కలిపి ఉంచేందుకే ఈ పండుగలన్నీ.

పండుగల్ని ఎంజాయ్ చేద్దామా మరి...

వేదకుమార్.యం

(మణికొండ వేదకుమార్)

ఎడిటర్ బాలచెలిమి



# జీవంలేని వస్తువుతో మాట్లాడించిన మార్కోని

రేడియో అనే ఒక అద్భుతాన్ని ఆవిష్కరించిన మార్కొని గురించి మీరు వినే వింటారు. వివిధ నిర్జీవ పరికరాలను ఒకచోట చేర్చి ఓ కొత్త వస్తువును తయారు చేసి దాని చేత మాట్లాడించిన అద్భుత శాస్త్రజ్ఞుడు మార్కొని. అతని పూర్తి పేరు గుగ్లియెల్మో మార్కొని. మార్కొని 1874 ఏప్రియల్ 25న ఇటలీలోని బోలోగ్నా సమీపంలో జన్మించారు. చిన్నతనం నుంచి సైన్స్ అన్నా పరిశోధనలన్నా ఎంతో ఇష్టం. ఇంట్లోని వస్తువులను, పరికరాలను, ఆటబొమ్మలను విప్పి పరిశీలించి తిరిగి మళ్లీ యధావిధిగా అమర్చి సాంకేతిక విషయాలను తెలుసుకునేవాడు. రేడియోలకు జీవం పోసి మాటలు నేర్పాడు. రేడియో వైర్‌లెస్ టెలిగ్రాఫీని అభివృద్ధి చేసినందుకు 1909లో భౌతిక శాస్త్రంలో నోబెల్ బహుమతిని పొందాడు.



మార్కొని తన సమకాలీన ఆవిష్కర్తలతో పోటీగా అనేక ఆవిష్కరణలకు, కొనసాగింపులకు కృషి చేసాడు. 1894లో హెన్రిచ్ హెర్జ్ కనుగొన్న హెర్జియన్ తరంగాలను కమ్యూనికేషన్‌లో ఉపయోగించవచ్చని అర్థం చేసుకున్నాడు. గాలిద్వారా టెలిగ్రాఫ్ సందేశాలను పంపటం, స్వీకరించడం కోసం చేసిన పరిశోధనలను ఇటాలియన్ ప్రభుత్వానికి అందించాడు. వాటిని ఆ ప్రభుత్వం తిరస్కరించగా 1896లో ఇంగ్లాండ్ వెళ్ళి పేటెంట్ పొందాడు. వైర్‌లెస్ టెలిగ్రాఫీ మొట్టమొదట ఆచరణాత్మక వ్యవస్థగా గుర్తించబడింది. 1897లో మార్కొని వైర్‌లెస్ టెలిగ్రాఫ్ కంపెనీ లిమిటెడ్ స్థాపించాడు. ఇది వాణిజ్యపరంగా విజయం సాధించి మార్కొని సంపన్నుడయ్యాడు.

1901లో మార్కొని వైర్‌లెస్ ద్వారా అట్లాంటిక్ మహాసముద్రం మీదుగా సంకేతాలను ప్రసారం చేయడంలో సఫలీకృతుడయ్యాడు. రేడియో తరంగాలు సరళరేఖలో మాత్రమే ప్రయాణిస్తాయనే ఇతర శాస్త్రవేత్తల నమ్మకాన్ని త్రోసిపుచ్చి పొడవైన తరంగాలు భూమి యొక్క వక్రతను అనుసరిస్తాయని నిరూపించాడు. అంచెలంచెలుగా అభివృద్ధి చేసి 1921 నాటికి మార్కొని వైర్‌లెస్ టెలిగ్రాఫీ వైర్‌లెస్ టెలిఫోనీగా మార్చాడు. ఇదే నేటి వాయిస్ రేడియో. లాంగ్‌వేవ్ బ్రాడ్‌కాస్టింగ్‌ను ఆచరణాత్మకంగా అభివృద్ధి చేసాడు. 1922లో చేసిన ఆవిష్కరణలే ఇప్పుడు ప్రపంచవ్యాప్త కమ్యూనికేషన్ వ్యవస్థలన్నీ ఉపయోగిస్తున్నాయి. రేడియో డైరక్షన్ ఫైండర్ ద్వారా ఓడలు, విమానాలు రేడియో సిగ్నల్స్‌ను ఉపయోగించి వాటి స్థానాలను గుర్తించవచ్చు. 1934లో మార్కొని ఓడల సాధన నావిగేషన్ పరికరాలను ప్రదర్శించాడు. అల్ట్రా హై ఫ్రీక్వెన్సీ (యుహెచ్ఎఫ్) తరంగాలను ఉపయోగించడంలో అతను మార్గదర్శకుడు. 1929లో మార్కొనిని ఒక మార్క్వెస్‌గా ప్రకటించారు. 1937 జూలై 20న రోమ్‌లో మరణించాడు.

– జుగాష్‌విలి

పోస్టల్ డే

# జాతీయ తపాల దినోత్సవం




అవ్వా తాతలకు ప్రేమతో..!

పిల్లలూ..! మీరంతా పత్తిపాక ఫౌండేషన్ మరియు గరిపల్లి ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన అవ్వా తాతలకు ఉత్తరాలు రాద్దాం కార్యక్రమంలో పాల్గొన్నారు కదా! ఈ సందర్భంగా మీకు జాతీయ తపాలా దినోత్సవం గురించి చెప్పాలనుకుంటున్నాను. ప్రతి సంవత్సరం అక్టోబర్ 10వ తేదీన జాతీయ తపాలా దినోత్సవాన్ని జరుపుకుంటున్నాము. తపాలా (పోస్టల్) అనేది కమ్యూనికేషన్స్ మంత్రిత్వ శాఖ కింద భారతదేశంలో ప్రభుత్వ నిర్వహణలో ఉన్న పురాతన వ్యవస్థ. పోస్టల్ వ్యవస్థ ఉత్తరాలు బట్వాడా చేయడమే కాక పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్, డిపాజిట్లను అంగీకరించటం లాంటి సేవలను కూడా అందిస్తుంది. ప్రపంచ వ్యాప్తంగా మందులను, ఉత్తరాలను, పార్శిళ్లను అందించే అతిపెద్ద తపాలా సేవను భారతదేశం కలిగి ఉంది. ప్రతికూల వాతావరణ పరిస్థితులలో కూడా మెయిల్ మరియు ప్యాకేజీలను బట్వాడా చేసే పోస్టల్ ఉద్యోగుల కృషిని అభినందించడానికి, కొత్తతరానికి పురాతన పురాతన కమ్యూనికేషన్ మోడ్ గురించి అవగాహన కలిగించడానికి తపాలాదినోత్సవం అవకాశం కల్పిస్తుంది.

ఈ సందర్భంగా వరల్డ్ పోస్టల్ డే గురించి కూడా చెప్పుకోవాలి. ప్రతి సంవత్సరం అక్టోబర్ 9వ తేదీని వరల్డ్ పోస్టల్ డేగా జరుపుకుంటాము. 1874లో స్విస్ రాజధాని బెర్న్‌లో యూనివర్సల్ పోస్టల్ యూనియన్(UPU) స్థాపన జరిగింది. 1969లో జపాన్‌లోని టోక్యోలో జరిగిన UPU కాంగ్రెస్ దీనిని ప్రపంచ తపాలా దినోత్సవంగా ప్రకటించింది. అప్పటి నుండి ప్రపంచంలోని అన్ని దేశాలు ఈ వేడుకల్లో పాల్గొంటున్నాయి. ఈ సందర్భంగా చాలా దేశాలు కొత్త పోస్టల్ ఉత్పత్తులు, మరియు సేవలను పరిచయం చేస్తాయి.

ఈ సంవత్సరం యూనివర్సల్ పోస్టల్ యూనియన్(UPU) తన 150వ వార్షికోత్సవాన్ని జరుపుకుంటోంది. 1971వ సంవత్సరం నుండి UPU ఇంటర్నేషనల్ లెటర్ రైటింగ్ కాంపిటీషన్స్‌ని నిర్వహిస్తోంది. ఉత్తరాల పోటీ ద్వారా పిల్లలలో అక్షరాస్యతని పెంపొందించడానికి కృషి చేస్తోంది. 9 నుండి 15 సంవత్సరాల వయస్సు గల పిల్లలకు ఇచ్చిన థీమ్ పై లేఖలు రాయడాన్ని ప్రోత్సహిస్తోంది. కొన్ని దేశాలలో ప్రపంచ తపాలా దినోత్సవాన్ని 'వర్కింగ్ హాలిడే' గా పాటిస్తారు. ఈరోజున కొన్ని తపాలా కార్యాలయాలు బాగా పని చేసిన తమ ఉద్యోగులకు బహుమతులను, ప్రోత్సాహకాలను అందజేస్తారు.

కోవిడ్-19 సమయంలో ప్రపంచవ్యాప్తంగా పోస్టల్ ఉద్యోగులు టెస్టింగ్ కిట్‌లను, మందులను సకాలంలో అందించడానికి తమ ప్రాణాలను కూడా లెక్కచేయకుండా ప్రజలకు సేవలను అందించారు. ఈ సందర్భంగా వారికి మరొక్కసారి జేజేలను తెలుపుదాం. పిల్లలూ పోస్టల్ స్టాంపుల సేకరణ, అధ్యయనాలని ఫిలాటెలిక్ అంటారు. అనేక దేశాల్లో ఈ ఫిలాటెలిక్ ప్రదర్శనలను కూడా అక్టోబర్ 9న జరుపుతుంటారు. కొత్త స్టాంపులను కూడా విడుదల చేస్తారు. భారతదేశంలో సుమారు 1,54,979 పోస్టాఫీసులు ఉన్నాయి. దాదాపు 5,79,595 లెటర్ బాక్స్‌లు ఉన్నాయి. ఈ బాక్స్‌లన్నీ ఎరుపు రంగులో ఉంటాయి. గమనించారా!


ప్రయాణ సౌకర్యాలు కాని, టెక్నాలజీ కానీ అంతగా అభివృద్ధి చెందని రోజుల్లో ఆత్మీయులకు క్షేమ సమాచారాలను తెలియ జేయడానికి ఉత్తరాలు ఎంతో గొప్ప పాత్రను పోషించాయి. మన పురాణాలలో కూడా సందేశాలను పంపడానికి లేఖలను రాసినట్లు ఎన్నో కథనాలు ఉన్నాయి. మన భావాలను అక్షరాలుగా మలచి, దాన్ని లేఖగా పంపడం ఎంతో మధురమైనది. అందుకున్నవారికి అది ఒక గొప్ప బహుమతి. పిల్లలూ మీరంతా అక్షరాన్ని గౌరవిస్తూ మీలోని రచయితని తట్టి లేపండి. లేఖా ప్రక్రియను కొనసాగిస్తూ, మన పురాతన తపాలా వ్యవస్థను కాపాడుకుందాం. మన వారసత్వ సంపదను ముందుతరాల వారికి అందిద్దాం.

– డా.నీరజ అమరవాది
m : 9849160055



# 'మాయాలోకం'లోకి పిల్లలందరికీ, పెద్దలకూ ఆహ్వానం

నేను రాసిన 'మాయలోకం' పిల్లల నవలకు 2024వ సంవత్సరం కేంద్ర సాహిత్య అకాడమీ బాల సాహిత్య అవార్డును ప్రకటించింది. 1982వ సంవత్సరంలో నేను మొదటిసారి 'అందమైన పూలతోట' అనే పిల్లల నవల రాశాను. అది 'బాలజ్యోతి' అనే పిల్లల పత్రిక పెట్టిన నవలల పోటీల్లో మొదటి బహుమతి పొందింది. ఆ నవల పిల్లలూ, పెద్దలూ ఎంతగా ఆదరించారో ఇప్పటికీ గుర్తుంది. పుస్తకంగా ప్రజాశక్తి బుక్‌హౌస్ వారు ప్రచురించారు. ఇప్పుడు ఆ నవల ప్రతులు లేవు. 'మా హృదయం' అనే మరో ప్రయోగాత్మక పుస్తకం పిల్లల కోసం రాయటం జరిగింది. ఆ రచన 'స్వాతి' మాసపత్రికలో సీరియల్‌గానూ తర్వాత పుస్తక రూపంలో వచ్చింది. అవేవీ ఇప్పుడు అందుబాటులో లేవు. 'జమీందారు కోట' అనే నవల ఆంధ్రప్రభ దినపత్రికలో వచ్చింది. తర్వాత 'దేవతా... ఓ... దేవత' అన్న నవలను 'నాటి బాలలకు, నేటి బాలలకు' అంటూ వాకాటి పాండురంగారావు గారు సీరియల్‌గా ప్రకటించారు. ఆ తర్వాత చాలా సంవత్సరాలు నేను పిల్లల కోసం నవలలు రాయలేదు. తర్వాత తానా-మంచి పుస్తకం వారు పిల్లల సాహిత్యాన్ని వారికి చేర్చటానికి నవలల పోటీ పెట్టారు. అలాగే 'బాలచెలిమి' లాంటి పత్రికలు మరికొన్ని సంస్థలు పిల్లల కోసం ప్రత్యేకంగా ఓ ఉద్యమ రూపంలో పని చేయటం అభినందనీయం. ఇప్పుడు కొన్ని వందల పిల్లల పుస్తకాలు ప్రచురిస్తున్నారు. పిల్లలు కూడా కవితలు, కథలు రాస్తున్నారు. 'మా హృదయం' పిల్లల భాషలో, పిల్లల దృష్టికోణం నుండి రాసిన ప్రయోగం. అలనాటి కల ఇన్ని దశాబ్దాల తర్వాత నెరవేరటం నాకు సంతోషం.




కేంద్ర సాహిత్య అకాడమి బాల సాహిత్యానికి అవార్డులు ఇవ్వటం 2010 నుండి మొదలు పెట్టింది. ప్రపంచ సాహిత్యంలో రవీంద్రనాథుడు, టాల్‌స్టాయ్ దగ్గర్నుంచి అనేక దేశాల్లో అక్కడి మహా రచయితలందరూ పిల్లల కోసం నిరంతరం తపించారు. గొప్ప సాహిత్యం సృష్టించి ఇచ్చారు. అవి అందరూ తమ భాషల్లోకి అనువాదం చేసుకున్నారు. మనకి కూడా ఆ వారసత్వం ఉంది. ఎన్నో పురాణ జానపద కథలు, చందమామ లాంటి పత్రికలు, పశువులు, పక్షులు, జంతువులు, రాక్షసులు, దేవుళ్ల కథలు, సాహసగాథలు, పంచతంత్ర కథలు. ఇలా బాల సాహిత్యం పిల్లలకు రకరకాల భాషల్లో రూపాల్లో అందుతూనే ఉన్నాయి. నేను ఆ తర్వాత పిల్లల పుస్తకం 'ఆట', 'దారి తప్పిన పిల్లవాడు', 'ఏంజెల్' లాంటి నవలలు పది సంవత్సరాలు దాటిన వారి కోసం రాశాను. అలాగే పిల్లల కోసం 'శీర్షికలు' నిర్వహించాను. రేడియో నాటికలు రాశాను. టెలీఫిల్మ్స్ నాలుగు, 'భారతి' అనే పిల్లల సినిమాకు రచనలు చేశాను. అవన్నీ స్వర్ణ నందులు, ఒకదానికి వెండి నంది వచ్చాయి. నాకు ఉత్తమ సంభాషణకు 'నంది' అవార్డు వచ్చింది. నేను రాసిన అనేక నవలల్లో పిల్లలే ప్రధాన పాత్రలు. అంతగా పిల్లలతో మమేకం అయ్యాను.

### మాయాలోకం కథ...

ఈ నవలకు 2021లో తానా-మంచి పుస్తకం వారు బహుమతిని ఇచ్చి పుస్తకంగా ప్రచురించారు. దీన్ని ఆధునిక పిల్లల నవలగా విమర్శకులు పేర్కొన్నారు. ఏమాత్రం అభివృద్ధి జరగని ఓ మారుమూల పల్లెలో ఈ కథ జరగుతుంది. ఇందులో గ్రామీణ జీవతం సంఘటనలు, మలుపులు ఉంటాయి. బాల్యం ఉంటుంది. పేదరికం ఉంటుంది. పిల్లల మధ్య గాఢమైన మైత్రి బంధువు చిత్రణ ఉంటుంది. ఇవన్నీ పిల్లలు తెలుసు కోవాలి. 'మంచి పుస్తకం' వారి దగ్గర ఈ నవల ఉంది. చదివి మీ అభిప్రాయం చెబితే మరిన్ని పుస్తకాలు రాయటానికి ప్రేరణ అవుతుంది. ఈ నా అభిప్రాయాలను మీతో పంచుకోవటానికి సహకరించిన వేదకుమార్ గారికి 'బాలచెలిమి' పత్రికకు సచిన్ గారికి ధన్యవాదాలు.


– పి. చంద్రశేఖర అజాద్
m : 9246573575



# టెస్సీ థామస్

## భారత క్షిపణి మహిళ

టెస్సీ థామస్ డిఆర్‌డిఓలో ఏరోనాటికల్ సిస్టమ్స్ డైరెక్టర్ జనరల్, భారత దేశ క్షిపణి సాంకేతికత, రక్షణ పరిశోధనలో కీలక పాత్ర పోషించిన అంతరిక్ష శాస్త్రవేత్త. కేరళలోని తుంబా రాకెట్ లాంచింగ్ స్టేషన్ సమీపంలో పెరిగిన ఆమెకు క్షిపణుల పట్ల మక్కువ ఎక్కువ.




ఆమె అగ్ని-4 క్షిపణికి ప్రాజెక్ట్ నిర్వాహకులుగా నియమితులయ్యారు. భారతదేశ క్షిపణి సాంకేతికతలో ఒక ముఖ్యమైన మైలురాయిని సాధించారు.

టెస్సీ ప్రయాణం 1988లో ఆమె డిఆర్‌డిఓలో చేరికతో ప్రారంభమైంది. ఆమె చేసినటువంటి అద్భుతమైన పని భారతదేశ రక్షణ సామర్థ్యాలను గణనీయంగా పెంచింది. ఆమెకు అనేక అవార్డులు లభించాయి. ఆమె విజయం సైన్స్ మరియు ఇంజనీరింగ్‌ని వృత్తిపరంగా ఆశించే యువతులకు ప్రేరణగా నిలిచింది.

సాంప్రదాయకంగా పురుష ఆధిపత్య రంగంలో ఆమె యొక్క అంకిత భావం, విజయాలు ఆమెను సైన్స్, టెక్నాలజీ, ఇంజనీరింగ్ మరియు మ్యాథ్ (STEM) రంగాలలో కోసం ఒక ఆదర్శ మహిళగా మరియు న్యాయవాదిగా మార్చాయి. ఇది ప్రపంచ వ్యాప్తంగా భారతదేశంలోని తరువాతి తరం మహిళా శాస్త్రవేత్తలకు, ఇంజనీర్‌లకు ప్రేరణ ఇస్తుంది.

టెస్సీ థామస్ భారతదేశంలోని క్షిపణి ప్రాజెక్ట్‌కు నాయకత్వం వహించిన మొట్టమొదటి మహిళా శాస్త్రవేత్త.


**- 'షీరోస్-256 ఇన్‌స్పైరింగ్ వుమెన్ ఫ్రమ్ ఇండియా'**

నుండి....

# గుణింతాల గుణగణాలు – 1




ఒక వాక్యంలోని పలు అక్షరాల తలకట్లు పలు విధాలుగా ఉంటే చాలు, చేతిరాత అందం పాడయి పోవడానికి.



**తలకట్టు**


ఆకారంలో, పరిమాణంలో మార్పులేకుండా ఒకే విధమైన తలకట్టు వచ్చేలా ఈ క్రింద చూపిన విధంగా అక్షరం లేకుండా కేవలం తలకట్టు వరుసగా అభ్యసించాలి.

**గమనిక:** తలకట్టును రెండు విధాలుగా రాయవచ్చు. అక్షరంలోని ప్రధాన భాగం రాసి, చేతిని పైకెత్తి తలకట్టును విడిగా పై భాగంలో రాసినప్పుడు పూర్తి "టిక్" మార్కు మాదిరిగాను; అక్షరం రాసి చేతిని పైకెత్తకుండా అక్షరానికి కలిపి రాసే తలకట్టును కేవలం కుడివైపు ఏటవాలు గీత మాదిరిగానూ అభ్యసించవచ్చు.




**దీర్ఘం :**

'7' అంకె మాదిరిగానో, అడ్డగీత రాసిన తర్వాత అపసవ్య దిశలో సున్న ఆకారాన్ని జత చేసి దీర్ఘాన్ని రాయకూడదు.




అడ్డగీతను పొడిగిస్తూ సవ్యదిశలోని "సున్నా" ఆకారాన్ని జతచేసి దీర్ఘం రాయాలి.




**గుడి :**

అచ్చు వేరు, చేతిరాత వేరు. తెలుగు అక్షరాలకు "గుడి"ని జత చేసినప్పుడు అచ్చులో కొన్నిసార్లు ఒక విధంగా, చేతిరాతలో మరొక విధంగా ఉంటుంది కాబట్టి, సాధారణంగా రాస్తున్నప్పుడు అచ్చులోని 'గుడి'ని ఉపయోగించనవసరం లేదు.




**గుడిదీర్ఘం:**

"గుడి" కి పై భాగంలో మాత్రమే సవ్యదిశలో గుడి దీర్ఘం రాయాలి. ఎక్కువ మంది గుడి దీర్ఘాన్ని గుడికి కుడి భాగంలో రాసే అలవాటు ఉంటుంది; కొంత మందికి గుడి దీర్ఘాన్ని మరీ పెద్దదిగా అక్షరం కుడివైపున క్రింది వరకూ రాసే అలవాటు ఉంటుంది. ఇవి రెండూ తప్పు.



**కొమ్ము, కొమ్ము దీర్ఘం :**

తలకట్టు లేకుండా ఉండే అక్షరం యొక్క ప్రధానమైన భాగం ఎత్తులో "కొమ్ము" రాయాలి. కొమ్ము చివరి భాగాన్ని కాస్త ఎడమ వైపు వంచి రాస్తే ఎంతో చక్కటి కొమ్ము దీర్ఘం రాయవచ్చు.



– వై. మల్లికార్జున రావు
డైరెక్టర్, మహా అకాడెమి, m : 9966961642

 కథ

# చేపల కాపలా




నరసింహపురం గ్రామంలో ఒక చెరువు ఉండేది. అందులో గ్రామస్థులు చేపల పెంపకం చేపట్టాలని నిర్ణయించారు. గ్రామ పెద్ద అనేక చేపలతో పాటు ఒక పది వింత చేపలను కూడా తెప్పించి ఆ చెరువు నీటిలో వదిలాడు. వాటిని ఎవ్వరూ ముట్ట వద్దని గ్రామ పెద్ద ప్రజలను అందరినీ కోరాడు. అందరూ సరేనన్నారు. గ్రామ పెద్ద ముందు చూపుతో దీనికి కాపలాగా రంగడు అనే వ్యక్తిని నియమించాడు. అతడు బద్ధకస్తుడు . తన వృత్తి ధర్మాన్ని చక్కగా నిర్వహించేవాడు కాడు.

ఇలా ఉండగా కొన్ని రోజులకు అక్కడికి గ్రామ పెద్ద వచ్చి చూస్తే కొన్ని చేపలు తగ్గినట్లు అనిపించాయి. వింత చేపలు ఏడు మాత్రమే కనిపించాయి. ఆయన రంగడిని నిలదీశాడు. "అయ్యా! నేను ఈ చెరువును కంటికి రెప్పలా కాపాడుతున్నాను. మీరు అనవసరంగా నా మీద నిందలు వేస్తున్నారు. చేపలు ఏమి కూడా తగ్గలేదు" అని అన్నాడు. అప్పుడు గ్రామ పెద్దకు కోపం వచ్చి "ఆ వింత చేపలు ఏడు మాత్రమే మిగిలి ఉన్నాయి. మూడు చేపలు పోయాయి" అని వాడికి చూపించాడు. అప్పుడు రంగడు అంగీకరించక తప్పలేదు. "మరి నేను ఇంత జాగ్రత్తగా కాపలా కాస్తున్నాను కదా! ఆ చేపలు ఎలా పోయినట్టు?" అని రంగడు ఆయనతో అన్నాడు. అప్పుడు ఆయన "నీవు సాయంత్రం సమయంలో నిద్ర పోతున్నావని తెలిసింది. అందువల్ల ఆ సమయంలోనే ఎవరో వచ్చి ఈ చేపలను ఎత్తుకొని పోతున్నారు కావచ్చు. నీవు నిద్ర పోవడం నీ తప్పు" అని గ్రామ పెద్ద అన్నాడు. అప్పుడు రంగడు "అయ్యా! నన్ను మన్నించండి. మరోసారి నేను నిద్రపోను" అని అన్నాడు.

ఆ తరువాత వారం రోజులకు గ్రామ పెద్ద తిరిగి ఆ చెరువును వచ్చి చూశాడు. ఆ చేపలు ఇంకా తగ్గాయి. ఆ వింత చేపలు ఐదు మాత్రమే ఉన్నాయి. ఇలా కాదని ఆయన రాముడు అని నిజాయితీగల మరొక కాపలాదారును నియమించాడు. రాముడు ఆ చెరువును జాగ్రత్తగా పరిశీలించ సాగాడు. సాయంత్రం సమయంలో రంగడు తిరిగి నిద్రపోయాడు. అదే సమయంలో ముగ్గురు దొంగలు వచ్చి ఆ చేపలు పట్టి వాటిని తీసుకొని పోతున్నారు. వారు రంగడు నిద్రలేవకుండా అతనికి మత్తుమందు వాసనను

చూపించారు. ఇది చెట్టు చాటుగా ఉండి గమనించిన రామునికి ఆ చేపలు ఎలా పోతున్నాయో అర్థమైంది. ఆ సంగతి అతడు వెంటనే గ్రామానికి వెళ్లి ఆ గ్రామ పెద్దకు తెలియజేశాడు. అతడు రహస్యంగా రాముడు కోరినట్లు తన మనుషులను ఆ దొంగలను పట్టుటకై పంపించాడు.

మళ్ళీ కొన్ని రోజులకు ఆ దొంగలు రంగడు సాయంత్రం నిద్రపోయే సమయానికి ఆ చేపలు పట్టడానికి వచ్చి ఎప్పటిలాగే అతనికి మత్తుమందు వాసనను చూపించారు. వెంటనే చెట్టు వెనుక దాక్కున్న రాముడితో పాటు గ్రామ పెద్ద పంపిన మనుషులు వచ్చి ఆ దొంగలను పట్టుకున్నారు. రంగడు ఇంకా నిద్రపోతూనే ఉన్నాడు. అతనికి ఏమి జరుగుతుందో తెలియ రాలేదు. ఈ సంగతి గ్రామపెద్ద కు తెలిసి ఆయన అక్కడికి వచ్చాడు. ఆయన వారిని పట్టించినందుకు రాముడిని అభినందించి రంగడిని నిద్రలేపబోయాడు. అప్పుడు రాముడు ఆయనతో ''అయ్యా! వీడు సాయంత్రం సమయంలో నిద్రపోవడం వీడి తప్పు. వీడు నిద్రపోవడం వల్లనే వాళ్ళ పని సులువుగా అయింది. మీరు ఈ దొంగలను పట్టుకుని పోయి శిక్షను విధించండి. మన చేపలు తగ్గడానికి ప్రధాన కారణం ఈ దొంగలే!" అని అన్నాడు. సరేనన్న గ్రామ పెద్ద వారిని గ్రామ కూడలి వద్దకు తీసుకుని వెళ్లమని, తాను వస్తానని తన మనుషులకు చెప్పాడు. వారు వారిని తీసుకుని వెళ్లిపోయారు. ఇంతలో అక్కడికి సమీపంలోని కొందరు గ్రామస్థులు వచ్చి తమ వీధుల్లో మురికి కాలువల సమస్య ఉందని, వాటిని పరిష్కరించాలని ఆయనను కోరారు. ఆయన తాను వాటిని పరిశీలిస్తానని వారి వెంబడి వెళ్లాడు.

కొద్దిసేపటికి లేచిన రంగడు రామునితో "ఏం జరిగింది?" అని అడిగాడు. రాముడు జరిగినదంతా చెప్పాడు. అప్పుడు రంగడు "అయ్యో! నా సాయంత్రం నిద్రనే ఇంత పని చేసింది. ఇలా చేపలు తగ్గడం నా బద్ధకం వల్లనే జరిగింది. నా తప్పును గ్రామ పెద్ద వద్ద ఒప్పుకుంటాను'' అని ఆయన వెళ్లిన వైపు వెళ్లి గ్రామపెద్దను కలిశాడు అతనిని చూసిన గ్రామ పెద్ద కోపంతో "నీ నిద్ర వల్లనే ఆ చెరువులోని చేపలు దొంగలు ఎత్తుకెళ్లారు. నీవు సాయంత్రం సమయంలో నిద్ర పోవడం మంచిది కాదు. 'బద్ధకము సంజనిద్దుర' అని పెద్దలు చెప్పారు. సాయంత్రం నిద్ర పోతే అది బద్ధకాన్ని కలిగిస్తుంది. నేను రాముడిని నియమించిన సంగతి నీకు గానీ, ఆ దొంగలకు గానీ తెలియదు. అందువల్లనే ఒక పథకం ప్రకారం వారిని పట్టుకున్నాం. వారిచ్చిన మత్తుమందు వల్లనే నీవు లేవలేదు. ఇకనుండి అయినా నీ బద్ధకాన్ని వీడి జాగ్రత్తగా ఉండు. నీవు ఇకనుండి గ్రామంలో పనిచెయ్యి" అన్నాడు. ఆనాటి నుండి రంగడు బద్ధకాన్ని వీడి సాయంత్రం సమయంలో నిద్ర పోవడం మానేశాడు.

తర్వాత గ్రామపెద్ద గ్రామ కూడలి వద్దకు వచ్చి దొంగలకు శిక్ష విధించబోయాడు. అదే సమయంలో వారి భార్యాపిల్లలు వచ్చి ఏడుస్తూ వారిని వదలిపెట్టమని, ఇకముందు వారు దొంగతనం చేయరని అన్నారు. అప్పుడు ఆ దొంగలు కూడా తమను క్షమించమని కన్నీళ్లు పెట్టుకున్నారు. అప్పుడు గ్రామపెద్ద "చూడండి! మీ భార్యాపిల్లలు ఎంత బాధపడుతున్నారో! దొంగతనం చేయడం చాలా తప్పు. సమాజంలో మీకు గౌరవం ఉండదు. ఆ దొంగతనం వల్ల ఒక్క మీరే కాకుండా మీ కుటుంబాలు కూడా ఇబ్బందులు ఎదుర్కొంటాయి. నేను ఇది మీ మొదటి తప్పుగా భావించి వదిలి పెడుతున్నాను" అని వారిని వదిలి పెట్టాడు.

– సంగనభట్ల చిన్న రామకిష్టయ్య
ధర్మపురి
మొబైల్: 9908554535

చెస్

## చదరంగం పుట్టిన దేశం అయినా చెస్ ఒలంపియాడ్‌లో

# స్వర్ణచరిత్ర సృష్టించిన భారత్






చదరంగంలో అత్యుత్తమ టోర్నమెంట్ అత్యధిక దేశాలు బరిలో నిలిచే ఈవెంట్ చెస్ ఒలింపియాడ్. వందేండ్ల చరిత్ర ఉన్న ఈ టోర్నీలో ఇండియా ఇప్పటిదాకా ఒక్కసారి కూడా విజేతగా నిలిచింది లేదు. రెండేండ్లకు ఓసారి జరిగే ఈ పోటీలో వరల్డ్ చాంపియన్ విశ్వనాథన్ ఆనంద్, కోనేరు హంపి వంటి లెజెండ్స్ ఎన్నిసార్లు ప్రయత్నించినా స్వర్ణ పతకం అందని ద్రాక్షగానే మిగిలింది. బుడాపెస్ట్ వేదికగా జరిగిన 45వ చెస్ ఒలింపియాడ్ ఇండియా ఏకంగా రెండు స్వర్ణాలు కైవసం చేసుకుంది. తెలంగాణ కుర్రాడు ఎరిగైసి అర్జున్తో కూడిన అబ్బాయిల జట్టుతో పాటు తెలుగమ్మాయి ద్రోణవల్లి హారిక నేతృత్వంలోని అమ్మాయిల జట్టు చెస్ ఒలింపియాడ్‌లో చాంపియన్లుగా నిలిచాయి. మైండ్ గేమ్‌లో తామే మాస్టర్స్ అని నిరూపిస్తూ.. దేశ చెస్ చరిత్రలో సరికొత్త అధ్యాయాన్ని లిఖించాయి. మన అర్జున్‌తో పాటు గుకేశ్, దివ్య దేశ్‌ముఖ్, వంతిక అగర్వాల్ వ్యక్తిగత స్వర్ణాలు కూడా సొంతం చేసుకున్నారు. టోర్నీలో ఓపెన్, విమెన్ ఈవెంట్లలో ఇండియా చాంపియన్ నిలిచింది. ఓపెన్లో ఎరిగైసి అర్జున్, దొమ్మరాజు గుకేశ్, పెంటేల హరికృష్ణ, ఆర్. ప్రజ్ఞానంద, విదిత్ సంతోష్ గుజరాతీతో కూడిన మెన్స్ టీమ్ 11 రౌండ్లలో 22 పాయింట్లకు గాను అత్యధికంగా 21 పాయింట్లు సాధించి అగ్రస్థానం కైవసం చేసుకుంది. 11 రౌండ్లలో అజేయంగా నిలిచి ఇండియా విజయంలో కీలక పాత్ర పోషించిన అర్జున్ మూడో బోర్డులో, గుకేశ్ టాప్ బోర్డులో వ్యక్తిగత స్వర్ణాలు కూడా అందుకున్నారు. హారిక నేతృత్వంలోని విమెన్స్ టీమ్ చివరి రౌండ్లో కీలక విజయంతో 19 పాయింట్లతో గోల్డ్ ఖాతాలో వేసుకుంది. ఈ జట్టులో ఆర్. వైశాలి, దివ్య దేశ్ ముఖ్, వంతిక అగర్వాల్, తానియా సద్దేవ్ ఉన్నారు. దివ్య, వంతిక 3,4వ బోర్డుల్లో వ్యక్తిగత స్వర్ణాలు గెలిచారు. ఇరు జట్లలోని పది మందిలో అర్జున్, హారిక, హరికృష్ణ తెలుగు రాష్ట్రాలకు చెందిన ప్లేయర్లు కాగా.. చెన్నైకి చెందిన గుకేష్ తల్లిదండ్రులు తెలుగు వాళ్లే. ఈ లెక్కన స్వర్ణచరిత్రలో నలుగురు తెలుగు ప్లేయర్లు భాగం అయ్యారని చెప్పొచ్చు.

– ఓజీఎస్ స్పోర్ట్స్ అకాడమీ
హైదరాబాద్

కథ

# భయం

రాజు! నీవు ఈ మధ్య ఎందుకు బడికి సక్రమంగా రావడం లేదు? జ్వరంగా ఉండటం వల్ల రాలేక పోతున్నాను సర్. నీవు తరచుగా జ్వరం వస్తుంది అంటున్నావు, రాజు... కారణం ఏంటి? మా ఊరి నుండి బడికి వచ్చే దారిలో ఎవరో కొందరు చేతబడి చేస్తున్నారు సార్. రోడ్డుపై ఉన్న నిమ్మకాయలను తొక్కితే, దెయ్యం పడుతుందని మా నానమ్మ చెప్పింది. నేను తెలియక, పోయిన నెలలో ఒకసారి నిమ్మకాయను తొక్కాను. అప్పటి నుండి నాకు బాగా భయం వేస్తుంది సార్. మా ఫ్రెండ్స్ కూడా నన్ను భయపెడుతున్నారు.

చూడు రాజు! నిమ్మకాయలు ఎక్కడ ఉన్నా, వాటి స్వభావం మారదు. వేసవిలో అయితే ఎండ తీవ్రతను నివారించడానికి నిమ్మ రసం తాగుతాం. కొంతమంది నిమ్మకాయలను కొత్త వాహనాలకు కడతారు. అదే నిమ్మకాయను పులిహోరలో కూడా ఉపయోగిస్తారు. ఇక నిమ్మకాయకు కొంచెం పసుపు, కుంకుమ కలిపి రోడ్డపై వేస్తే, కొందరు చేతబడి అని నమ్మి భయ పడతారు. కేవలం మన ఆలోచనలలో మార్పు వల్లే భయం వేస్తుంది. నిమ్మకాయ వల్ల కాదు. వెంటనే జ్వరం తగ్గడానికి డాక్టర్‌ను కలువు. నేను మీ స్నేహితులకు కూడా చెప్తా అంటూ ధైర్యం చెప్పాడు సైన్స్ ఉపాధ్యాయుడు సురేష్.



Babu Dundrapelly

అలాగే సార్ అంటూ సైన్స్ మాస్టారు ఇచ్చిన భరోసాతో హుషారుగా తరగతి గదిలోకి వెళ్ళాడు రాజు.

– యం. రాం ప్రదీప్
జెవివి, తిరువూరు
m : 9492712836

## సామెతలు

- ఇచ్చితినమ్మా వాయనం అంటే పుచ్చుకుంటినమ్మా వాయనం అన్నట్లు
- అడ్డెడు బియ్యమిచ్చి అమ్మా నీ ప్రసాదమన్నట్లు
- జరిగే మట్టుకు జయభేరి, జరక్కపోతే రణభేరి
- గరిక చేను గాడిద పాలు
- కష్ట సంపాదనం, ఇష్ట భోజనం
- కుమ్మరికి కుండ కరువు, సాలేకు బట్ట కరువు
- గుడిలో దేవుడికి నైవేద్యం లేకుంటే, పూజారి పులిహోర కోసం ఏడ్చాడట?
- అన్నం చొరవే గాని అక్షరం చొరవ లేదు
- దానాలలో కెల్లా నిదానం శ్రేష్ఠం

– బాలచెలిమి

ఆట



# గుజ్జెన గూళ్ళు

**ఎంతమంది పాల్గొనవచ్చు - ఎందరైనా ఆడవచ్చు**

**ఎక్కడ ఆడవచ్చు - ఇంటా, బయటా ఎక్కడైనా**

**ఈ ఆటకు గల ఇతర పేర్లు - గురుగులాట, బొమ్మలాట, బువ్వలాట**

'గుజ్జెనగూళ్ళు' ఆట కేవలం సంసారపు శిక్షణ ఇచ్చే ఆట. ఈ ఆటను పూర్వం ఉమ్మడి కుటుంబాల్లో చిన్న పిల్లలు ఆడుకునేవారు. ఈ ఆటను పిల్లలు ఎందరైనా ఆడవచ్చు. పిల్లలు తమ పెద్దలనడిగి బియ్యము, పప్పులు, మరమరాలు, బెల్లం, పంచదార తెచ్చుకొని లక్కపిడతల్లో (చెక్కతో చేయబడిన చిన్న చిన్న వంట సామాను) పోసి వాటిని పొయ్యి మీద పెట్టినట్లు, దించినట్లు నటిస్తూ కొంత సేపటికి అందరూ కలిసి తింటారు. ఈ ఆట ఆడినప్పుడు బొమ్మల పెళ్ళి చేసి రెండు జట్లుగా విడిపోయి వియ్యాలవారికి విందు ఏర్పాటుకై గుజ్జెనగూళ్ళు పెడతారు. బాగా పండిన చింతకాయలను తెచ్చి జాగ్రత్తగా దానిలో నుంచి గుజ్జును గుల్ల చెడిపోకుండా పూర్తిగా తీసి, ఆ గుల్లలో బియ్యము పోసి, దానిని మండుతున్న పొయ్యిలో పెట్టి అవి ఉడికిన తరువాత పిల్లలు 'గుజ్జ గూళ్ళు' అని వేడుకగా తింటారు. ఈ ఆట పిల్లల రేపటి జీవితానికి ప్రాథమిక పాఠం అవుతుంది..





- 'చిన్ననాటి ఆటలు-జ్ఞాపకాల మూటలు' నుండి...

# మంచి మిత్రులు



కాజీరామారం గ్రామంలో సరిత హరిత అనే ఇద్దరు స్నేహితులు ఉండేవారు. వారిద్దరూ ప్రాణ స్నేహితులు. వారి స్నేహం చూడముచ్చటగా ఉండేది. అదే గ్రామంలో భవ్య అనే మరో అమ్మాయి ఉండేది. వీరి స్నేహాన్ని చూసి ఎంతో అసూయ పడింది.వారి స్నేహం చెడగొట్టడానికి వారి ఇద్దరి మధ్య గొడవ పెట్టాలని ప్రయత్నించేది. ఒకరోజు సరిత క్లాస్‌లోకి వచ్చి స్నేహితురాలు హరితతో 'నాకు మా నాన్న కొత్త కంపాస్ తెచ్చాడు. నీకు చూపించాలా?' అన్నది

'చూపించు...' అన్నది హరిత.

సరిత తన కంపాస్ చూపించింది.

చాలా బాగుందని హరిత మెచ్చుకున్నది. అది చాటుగా చూసిన భవ్య వీరిద్దరూ బయటకి వెళ్ళింది గమనించి మంచి సమయం వచ్చిందని సరిత బ్యాగులోని కంపాస్ బాక్స్ తీసి హరిత బ్యాగులో పెట్టింది. సరిత తన బ్యాగులో కొత్త కంపాస్ బాక్స్ కనిపించకపోయేసరికి హరితతో నా కంపాస్ బాక్స్ ఎవరో తీశారన్నది. అంతలో భవ్య వచ్చి సరితకు సలహా ఇచ్చింది. 'అందరి బ్యాగులు చెక్ చెయ్ తప్పకుండా నీ కంపాస్ బాక్స్ దొరుకుతుంది' అన్నది.

సరిత అందరి బ్యాగులు చూసింది కానీ హరిత బ్యాగు మాత్రం చూడలేదు. ఎందుకంటే తన ప్రాణ స్నేహితురాలు తన కంపాస్ తీయదు అని నమ్మకంతో. భవ్య 'హరిత బ్యాగ్ కూడా చూడవచ్చు కదా' అని అన్నది.

భవ్య వెళ్లి హరిత బ్యాంక్ చెక్ చేసింది. ఆశ్చర్యంగా అందులో కంపాస్ బాక్స్ కనిపించింది. సరిత హరితతో మాట్లాడలేదు. మరుసటి రోజు బడికి వచ్చారు. మరో స్నేహితురాలు కావ్య వచ్చి భవ్య చేసిన పని ఇద్దరు స్నేహితులకు చెప్పింది. కంపాస్ బాక్స్ దొంగిలించింది హరిత కాదని భవ్యనే తీసి హరిత బ్యాగులో పెట్టిందని చెప్పింది.

కావ్య వీళ్లిద్దరిని, భవ్యను టీచర్ వద్దకు తీసుకొని వెళ్ళింది. టీచర్ భవ్య చేసిన పనికి కోప్పడింది.

సరిత తను అపార్థం చేసుకున్నానని హరితకు సారీ చెప్పింది. మంచి మిత్రులుగా కొనసాగారు.

– చనగాని సాత్విక
8వ తరగతి
జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల తాటికల్



# వృక్ష క్షేత్రం మరికల్ మర్రి

మహబూబ్‌నగర్ జిల్లా వట వృక్షాలకు పేరెన్నిక గన్నది. మహబూబ్‌నగర్ జిల్లా క్షేంద్రం నుండి చుట్టు పక్కల సుమారు 30 కిలోమీటర్ల వ్యాసార్థంలో అరడజన్ మర్రి వృక్షాలున్నాయి. ఇవన్నీ పర్యాటకానికి అనువైనవే. కాని ఒక పిల్లలమర్రిని మాత్రమే ఇప్పటివరకు ప్రభుత్వం పర్యాటక స్థలంగా అభివృద్ధి చేసింది. అంతకంటే అందమైన మర్రి మరొకటి పిల్లలమర్రికి 30 కిలోమీటర్ల దూరంలోనే ఉంది. దాని పేరు గోసాయి మర్రి. ఈ మర్రి కింద గోసాయిలు అనే సన్యాసులు నివసించారు. కాబట్టి దానిని గోసాయి మర్రి అని స్థానికులు పిలుస్తున్నారు. అదే మరికల్. ఈ మరికల్ గ్రామం రంగారెడ్డి జిల్లాలోని కులక్‌చర్ల మండల పరిధిలోని కొత్తపల్లి తాండాకు దగ్గరలో ఉంది. హైదరాబాద్ నుండి బెంగళూరు రహదారిలో వచ్చే జడ్చర్లకు ముందున్న మాచారం (87 కి.మీ.) నుండి కుడివైపుకు తిరిగి నవాబ్‌పేట మీదుగా 20 కిలోమీటర్లు ప్రయాణించి ఈ మర్రిని చేరుకోవచ్చు.

**వృక్ష క్షేత్రం :** ఈ మర్రి కేవలం పెద్ద చెట్టుగా మాత్రమే కాకుండా క్షేత్రంగా కూడా తరతరాల నుండి పూజలందుకుంటున్నది. ఇది అందమైనది, ఆహ్లాదకరమైనది కావడం వల్ల మనుషులతో పాటు పశుపక్ష్యాదులు కూడా ఈ చెట్టును ఆశ్రయిస్తున్నాయి. ఈ మర్రి కిందే గోసాయిలు వీరాంజనేయ విగ్రహాన్ని ప్రతిష్ఠించి మర్రి ఊడలనే గోడలుగా మలచుకొని ఆలయం నిర్మించారు. ఆంజనేయుని ఆలయం ముందు రెండు శిల్ప శోభితాలైన స్తంభాలున్నాయి. సుమారు ఐదు అడుగుల ఎత్తుతో నలు చదరాలుగా ఉన్నాయి. ఒక స్తంభానికి హనుమంతుడు నాలుగు రూపాలతో శిల్పించబడ్డాడు. ఎడమ వైపుకు చూస్తున్నట్లు, కుడి వైపుకు చూస్తున్నట్లు, ఎదురుగా చూస్తున్నట్లు, వంగి చూస్తున్నట్లున్న హనుమంతుడు శిల్పం ఉంది. అయితే రాముడి విగ్రహం ఈ పరిసరాల్లో కనిపించలేదు. తాబేలు శిల్పం కింద ఒకే కన్ను ఆధారంగా నాలుగు చేపలు శిల్పించిన తీరు ఆసక్తిని రేకెత్తిస్తుంది. ఊరి చెరువులో తాబేళ్ళు, చేపలుండటం గమనార్హం. మర్రి చెట్టుకు వాయువ్య దిశలో ఉన్న బురుజు దగ్గర 'బురుజు మైసమ్మ' సన్నిధి ఉంది. అదే దిశలో ఫర్లాంగు దూరంలో ఉన్న మరో బురుజు దగ్గర పరిగి తిప్పవ్వ విగ్రహముంది.

**పర్యాటక ప్రయత్నాలు :** రాష్ట్ర పురావస్తు శాఖ అధికారులు ఈ మర్రిని పరిశీలించి, ఇది 600 సంవత్సరాల కంటే ముందుదని, తమిళనాడు రాష్ట్రంలో ఉన్న అడయార్ మర్రి కంటే పెద్దదని నివేదించారు. కాని ప్రభుత్వం ఇప్పటివరకు ఏ అభివృద్ధి కార్యక్రమాలనూ ఇక్కడ చేపట్టలేదు. పైగా ఈ చెట్టు చుట్టు పక్కలా భూ ఆక్రమణలు విస్తరిస్తున్నాయి.

**పర్యాటక అవకాశాలు :** ఈ మర్రి చెట్టు, దాని పరిసరాల్లో పర్యాటక అవకాశాలు పుష్కలంగా ఉన్నాయి. కాబట్టి ప్రభుత్వం ఈ క్రింది కార్యక్రమాలు చేపడితే బాగుంటుంది. 1. ముందుగా ఈ చెట్టు ఇక మీదట ఆక్రమణకు గురికాకుండా దీని చుట్టూ కంచె ఏర్పాటు చేయాలి. 2. దీని కింద నర్సరీని పెంచాలి. 3. దీని కింద జింకలు, కుందేళ్ళను పెంచాలి. సందర్శకులకు అవి ఆహ్లాదాన్ని కూడా పంచుతాయి. 4. ఈ చెట్టు కొమ్మలు, ఊడలు చాలా ఎత్తుగా ఉన్నాయి. కాబట్టి వాటి పైన (పది మీటర్ల ఎత్తున) పావు కిలోమీటర్ పొడవున తలకోన (చిత్తూరు జిల్లా)లో ఏర్పాటు చేసినట్లుగా ఊగే ఊయల వంతెన ఏర్పాటు చేసి దాని మీద ఆహ్లాదకరంగా నడిచే అవకాశాన్ని పర్యాటకులకు కలుగజేయాలి. 5. సమీపంలోని ఊరి కుంట, ఊరి చెరువులో పెడల్ బోట్లు ఏర్పాటు చేయాలి. 6. చెట్టు, ఊరి కుంట మధ్యలో పిల్లల ఆట స్థలం ఏర్పాటు చేయాలి. 7. పర్యాటకుల కోసం ఒక రెస్టారెంట్ ఏర్పాటు చేయాలి. ఈ విధంగా చేస్తే ఆరు వందల ఏళ్ళ చరిత్ర కలిగి నాలుగు ఎకరాల్లో విస్తరించిన ఈ అరుదైన మర్రి చెట్టును కాపాడినట్లూ అవుతుంది, పర్యాటకులకు కొత్త పర్యావరణ పర్యాటక క్షేత్రాన్ని అందుబాటులోకి తెచ్చినట్లూ అవుతుంది. లేదంటే ఈ అరుదైన చెట్టు ఆక్రమణలకు గురై అవశేష స్థితికి చేరే ప్రమాదముంది.

– డా. ద్యావనపల్లి సత్యనారాయణ
m : 94909 57078






# హంసలు



హంసలు గుంపు ఒకటి శీతల ప్రాంతాల నుండి ఉష్ణ దేశాలకు ఎగిరి వెళుతోంది. అవి సముద్రంపై ఎగురుతూ వెళుతున్నాయి. అవి అలా పగలనక రాత్రి అనక, విశ్రాంతి లేకుండా ఎగిరి వెళుతున్నాయి. అది పున్నమి రాత్రి, పండు వెన్నెల కాస్తోంది. ఆకాశాన ఎగురుతున్న హంసలు కిందనున్న జలాలను చూశాయి. రోజుల తరబడి ఎగురుతున్నాయేమో అవి అన్నీ అలసిపోయున్నాయి. ముందు వరసలో బలమైన పెద్ద హంసలున్నాయి. వెనక చిన్న పక్షులూ, బలహీనమైన పక్షులూ ఉన్నాయి. అన్నిటికంటే వెనక చిన్న హంస ఒకటి ఎగురుతోంది. దీని బలం అంతకంతకు తగ్గిపోయి, నీరసపడిపోతోంది. చివరకి అది ముందుకు ఎగరలేక రెక్కలు చాచి, కిందకి పడిపోసాగింది. అది క్షణక్షణానికి నీటికి మరింత దగ్గరగా వచ్చేస్తోంది, క్షణక్షణానికీ దాని నేస్తులు మరింత దూరంగా పండు వెన్నెలలోకి ఎగిరిపోతున్నారు. ఆ హంస నీటి మీద వాలి, రెక్కలు ముడుచేసుకుంది. దాని శరీరం కింద సముద్రజలాలు కదిలి, దానిని ఇటూ అటూ వూపాయి. నీటిపైన తేలుతున్న హంసకి, ఆకాశాన ఎగిరిపోతున్న హంసల గుంపు పిండి ఆరబోసినట్లున్న వెన్నెలలో తెల్లని చుక్కల్లా కనబడ్డాయి. తరువాత వాటి రెక్కల చప్పుడు నిశ్శబ్దంలో వినబడింది. అవి పూర్తిగా అదృశ్యమైపోయిన తరువాత, నీటిపైన ఉన్న హంస మెడ వెనక్కి వాల్చి కళ్లు మూసుకుంది. అది రవంతైనా కదలలేదు. సముద్రం మాత్రమే వెడల్పు చారలలో పైకిలేస్తూ కిందకు దిగుతూ తనతో కూడా దానిని పైకీ కిందకూ ఊపుతోంది. తెల్లవారే ముందు సన్నని పిల్లగాలి సముద్రాన్ని మెల్లగా తాకింది. హంస కళ్లు విప్పింది. తూర్పున పొద్దు పొడుస్తోంది. చంద్రుడూ, నక్షత్రాలూ వెలవెల బోతున్నాయి. హంస నిట్టూర్చింది. మెడ పొడుగ్గా చాచి, రెక్కలు తపతపలాడించి ఎగిరింది. ఎత్తుకి, ఇంకా ఎంతో ఎత్తుకి ఎగిరి ఉష్ణదేశాలున్న వైపుకి ఎగిరిపోతోంది. తన నేస్తులు వెళ్లిన చోటుకి అది ఒంటరిగా ఎగిరిపోతోంది.

**– లియో టాల్‌స్టాయ్ బాలల కథలు నుండి**

✣ ఐటి

# ఆటోమేషన్ పై విశ్లేషణ




ఉద్యోగం యొక్క భవిష్యత్తు: దూర కార్యాలయ మరియు ఆటోమేషన్ పై ధోరణుల విశ్లేషణ, భవిష్య కాలంలో ఉద్యోగాలపై పరిగణన. ఉద్యోగం ఒక భారీ మోస్తరు మార్పు ద్వారా మారుతోంది. ఇది ప్రధానంగా దూర కార్యాలయం మరియు ఆటోమేషన్ వంటి సాంకేతిక అభివృద్ధులు మరియు ప్రపంచవ్యాప్తంగా పలు ఉద్యోగ సంస్కృతులు మారుతున్నాయి. ఈ ధోరణులు ఉద్యోగం అంటే ఏమిటో, ఎక్కడ పని చేయాలో, ఎలా పని చేయాలో, మరియు భవిష్యలో అవసరమైన ఉద్యోగాల రకాలు radically మళ్లీ నిర్వచిస్తున్నాయి.

ప్రస్తుతం సాధారణమైన దూర కార్యాలయం, COVID-19 మహమ్మారి వల్ల వ్యాపారాలకు తప్పనిసరిగా మారింది. అత్యవసర పరిష్కారం అనేక పరిశ్రమలకు శాశ్వతంగా మారింది. కంపెనీలు దీని ద్వారా లాభం పొందగలవని గ్రహించాయి; ఈ లాభాలలో ఎక్కువ ఖర్చులు తగ్గించడం, ప్రపంచవ్యాప్తంగా ప్రతిభకు చేరువ కావడం, ఉద్యోగుల్లో మొత్తం సంతృప్తి స్థాయిలు ఉన్నాయి. ఉద్యోగి కోసం, వ్యక్తిగత స్థలంలో పని చేయడం మంచి పనితీరు-జీవిత సమతుల్యతను సూచిస్తుంది, మరింత స్వేచ్ఛ, పొడవాటి పయనానికి సంబంధించ కుండావడాన్ని సూచిస్తుంది. అయితే, ఇది డిజిటల్ కమ్యూనికేషన్ సాధనాలు, సహకార వేదికలపై స్వయంసంరక్షణ, సాంకేతిక పరిజ్ఞానం కలిగి ఉండటానికి అవసరమవుతుంది. ఆటోమేషన్ పెరుగుదల ఉత్పత్తిని పెంచుతుంది, ప్రక్రియలను సాఫీ చేస్తుంది, తద్వారా మానవ తప్పిదాన్ని చాలా తక్కువ చేస్తుంది. మరిన్ని ఉద్యోగాలు యంత్రాలు, కృత్రిమ మేథా, రోబోటిక్స్ ద్వారా నిర్వహించబడుతున్నాయి, ఇవి గతంలో పునరావృతమైన పనులను అవసరపడతాయి. ఇంతవరకు నెరవేర్చిన సామర్థ్యాలు అన్ని చోట్ల కనబడుతున్నా, ఉద్యోగ పోగొట్టుకోవడం యొక్క ప్రమాదం ఇంకా ఎక్కువగా ఉంది. రిటైల్, కస్టమర్ సేవా పనులు, సాధారణ తయారీ ఆటోమేటెడ్ సిస్టమ్స్ ద్వారా నిర్వహించ బడుతున్నాయి. అయితే, కృత్రిమ మేథా అభివృద్ధి, డేటా విశ్లేషణ, సైబర్‌సెక్యూరిటీ వంటి కొత్త అవకాశాలకు ప్రత్యేక నైపుణ్యాలు అవసరం. భవిష్య ఉద్యోగుల కొత్త వాస్తవం, వారు దూర కార్యాలయ మరియు ఆటోమేషన్‌కు అనుగుణంగా మారాలి. ఎక్కువ డిజిటల్ సాంకేతికత, సృజనాత్మకత, సమస్యల పరిష్కరించే సామర్థ్యాలకు అవసరం ఎక్కువగా ఉంది. ఉద్యోగులు తమ నైపుణ్యాలను నిరంతరం నవీకరించుకోవాలని, జీవితమంతా అభ్యాసం కలిగిన సంస్కృతిలో జీవించాలని ఎదురు చూస్తున్నారు, అదే సమయంలో సాంకేతికత వేగంగా అభివృద్ధి చెందుతూనే ఉంటుంది. సాంకేతిక ఉద్యోగాలు, ఆరోగ్య సంరక్షణ, పచ్చ ఎర్జీ, మరియు సృజనాత్మక పరిశ్రమలు అభివృద్ధి చెందుతాయని, మరి కొన్ని మరవుతాయని ఊహిస్తున్నారు. ఈ మారుతున్న దృశ్యంలో, యజమానులు, ఉద్యోగులు ఉల్లాసంగా ఆలోచించాలి, ముందుకు చూడాలి. వ్యాపారాలు ఉద్యోగుల నైపుణ్యాలను పెంచడంలో పెట్టుబడి పెట్టాలి, ఆవిష్కరణ సంస్కృతిని నిర్మించడానికి పని చేయాలి, అయితే ప్రజలు ఆటోమేషన్‌తో పోటీ చేయడం కాకుండా అనుగుణంగా నైపుణ్యాలను అభివృద్ధి చేయాలి. ఈ మార్పులను అంగీకరించడం వల్ల ఉద్యోగ భవిష్యత్తు కేవలం మరింత సమర్థవంతమైనదే కాకుండా, ఖచ్చితంగా మరింత సమానమైనది, స్థిరమైనది అవుతుంది.

– కార్తీక లక్ష్మీ

విద్యార్థిని, హైదరాబాద్.

నాటిక

# చదువు

## 1వ దృశ్యం

(కొడుకు – తండ్రి)

తండ్రి
(రాజయ్య): ఏం రా! చేతుల పల్కవట్టుకున్నవు ఎటు వొతవ్?

కొడుకు : బడికి వోతనే...

తండ్రి : అగో... బడికి వోతె మేకల మేపనీకి వోళ్ళువోతరు!

కొడుకు : అయ్య! నేను సదుకుంటానే... బడికి వోతనే...

తండ్రి : ఓట్... బడి లేదు గడి లేదు... మేకలు ఆగం అయితయ్... గుట్టకు వో... తంత కొడుకా...

కొడుకు : (ఊ... ఊ.... ఏడ్చుకుంటు వోతడు...)

## 2వ దృశ్యం

కోటయ్య : ఒరే... రాజయ్యా! యాడున్నవ్ రా...


రాజయ్య : ఈడనె ఉన్ననే... మేకలకు కొట్టం గడ్తున్నా..

కోటయ్య : ఒరేయ్.. నీ కొడుకు అడవిల చెట్టు మీదికెక్కి పడ్డడటరా... నడు... నడు...

రాజయ్య : అయ్యో! నడువే... నడు... పిల్లగాడు ఎట్లున్నడో... (రాజయ్యా... కోటయ్య... ఇద్దరూ వెళ్ళేసరికి... చెట్టు కింద పడి ఉంటాడు...)

రాజయ్య : అయ్యో కొడుకా (ఏడుస్తూ...) అద్దంటే అడవిలకు పంపితి గదరా.. బడికి వోయిన నువు బత్కెటోడివి... గిట్లయి పోయె... దేవుడా...

కోటయ్య: ఒరే ఆపు... నీ కొడుకు సచ్చిపోలేదు రా... అగో కదుల్తున్నడు... ఒరే బాపూ లెవ్వురా... అయ్యో కాలు కదుల్త లేదు. ఒరే రాజయ్యా... నీ కొడుకుకు కాలు ఇరిగిందిరా... చెయి గూడ ఇరిగిందిరా.



రాజయ్య: అయ్యో! నా కొడుకును బడికి పంపినా మంచిగుంటుండే. కాలు, చేయి ఇర్గక పోయేది... వాడికి ఇష్టమున్న సదువు సదివియ్యక పోతినే... ఆడు మంచిగైనంక తప్పక బడికి పంపుత...

పాట : (నేపథ్యం నుండి)
"చదువకుంటానంటే
ఛల్ వద్దు వద్దంటు
పనిలోకి పంపితే అయ్యా...
ఫలితంబు ఏమాయె
కాలు, చేయి విరిగే
పాపమ్ము ఎవరిదో అయ్యా,
ఈ పాపమ్ము ఎవరిదో అయ్యా....

### 3వ దృశ్యం

(తల్లి... కూతురు... చాప మీద పడుకొని ఉంటుంది. చేతుల ఒక పుస్తకం...)

తల్లి : అమ్మీ! ఎక్కడున్నవే...

కూతురు : అమ్మా! పుస్తకంలో బొమ్మలు చూస్తున్ననే

అమ్మ : బొమ్మలు చూస్తే కడుపు నిండుతదా! వచ్చి నాతో పాటు ఈ గిన్నెలు తోము.

కూతురు : అమ్మా, నేను రానే... నేను బడికి వోతా మంచిగ సదుకుంట...

అమ్మ : అగో మళ్ళ మొదలుపెట్టినవా... నువు సదుకొని, ఊర్లు ఏలతావా ఏంది? ఏమద్దు... ఇంటి పనులు నేర్చుకో... చేసుకొ పోయి...

కూతురు: అమ్మ... నేను సదుకుంటనే...

అమ్మ : సదువు లేదు... గిదువు లేదు నడువ్ పనులకి...

(అమ్మాయి... లోపలికి వెళ్ళి గిన్నెలు కడుగుతుండాలి...)

పోస్ట్‌మాన్: అమ్మ! పోస్ట్... (ఒక కవర్ పడేసి పోతాడు...)

అమ్మ : మనకు గీ పోస్టులో ఏమొచ్చిందబ్బా... అమ్మ సూడవే...

కూతురు : ఆ... నాకు సదువు వస్తే కదా, చూసేది, సదివేది... (కవరును అటు ఇటు తిప్పి అక్కడ పడేస్తుంది)
నేను సదుకుంటే ఈ ఉత్తరంల ఏమున్నదో సదివేదాన్ని... నాకు సదువే రాకపోయె... నా దోస్తులంతా ఏడో తరగతి సదుతున్నారు... అమ్మ! నేను బడికి వోతనే సదుకుంటనే...

అమ్మ : షురు జేసినవ్.. నడు... పనులకు... (ఇద్దరూ లోపలికి వెళ్తారు)

అమ్మ : ఈ కవరు వచ్చి పది రోజులయ్యింది... దీన్ని సదివిపిద్దామంటే ఒక్కరు దొరుకుత లేరు... మాకేమో సదురాకపోయె.. ఎట్లబ్బా... (దూరం నుండి ఒక సర్ వస్తుంటారు)
అగో! బడిల సదుజెప్పేసారు, ఇటే వస్తున్నాడు, ఈ ఉత్తరం సారుతో సదివిస్తా...
సారూ... ఓ సారూ...

టీచర్ : ఏందమ్మ అట్లా అరుస్తున్నావ్...

తల్లి : ఏం లేదు సర్... గీ ఉత్తరం మీద సదివి దాంట్ల ఉన్న విషయం చెప్తరేమోనని పిల్సినా..

టీచర్ : (ఆ కవర్ విప్పి చూసి) అమ్మ ఈ ఉత్తరం మీకు ఎప్పుడు వచ్చింది...

తల్లి : ఏమైంది సర్... కొంపదీసి ఎవరైన పోయిన్రా ఏంది...

టీచర్ : అది కాదమ్మ... మీకు మన రాష్ట్ర ప్రభుత్వం

నుంచి పదివేల రూపాయలు.. 'గరీబు' పథకం కింద మంజూరైనాయి...

తల్లి : ఐతే.. మంచిదే కదా సర్..

టీచర్ : కానీ, మిమ్మల్ని వారం రోజుల లోపున వచ్చి ఆధార్ కార్డు చూపించి ఆ డబ్బు తీస్కపొమ్మన్నరు..

తల్లి : సరే... సరే... ఇప్పుడే పోతం... పైసలకు బగ్గ పరేషాన్‌గ ఉన్నది... పది వేలయితే మా కష్టాలు తీరినట్లే... పొమ్మంటరా సారు...

టీచర్ : ఎటూ... పోయేది... వాళ్ళు రమ్మన్న తేదీ మొన్నటికే అయిపోయింది... ఇగ మీకు పైసలు ఇయ్యరు.

తల్లి : ఎంత పని జరిగింది... గీ ఉత్తరం రాంగనే ఎవరితోనైనా సదివియ్యకపోతినే....

టీచర్ : ఎవరితో ఎందుకమ్మ నీ బిడ్డను బడికి పంపితే ఇవాళ సదివి చెప్తుండె కదా.. ఈ నష్టం మీకు తప్పుతుండే కదా! మీ అమ్మాయిని బడికి పంపితే తన కాళ్ళ మీద తాను నిలబడుతుంది. నల్గురికి దారి చూపుతుంది, పంపమ్మా.

తల్లి : సరే సార్...

పాట (నేపథ్యం నుండి)

"ఆడ పిల్లకు చదువు
యాడైన పనికొచ్చు
అమ్మాయి చదివితే
అవనికే వెలుగొచ్చు
అందుకే చదివించు ఓరన్నో
అమ్మాయి నందుకే చదివించు ఓరన్నో...!

### 4వ దృశ్యం

(తండ్రి... కొడుకు... పాలు పోస్తుంటారు)




తండ్రి : ఒరే శీనుగా, నడువురా, ఇప్పటికే లేట్ అయ్యింది... పాలు టైంకు పొయ్యకపోతే అమ్మగారు కోప్పడతారు.

కొడుకు : నేను నీతో రానంటే పట్టుకొస్తవు... నాకు ఇట్ల పాలు పోసుడు ఇష్టం లేదే మంచిగ బడికి పోయి సదుకుంటా...

తండ్రి : వారీ! పాలు అమ్మకోకపోతే మనకు దినం గడువది నడు... నడు... బడికి పోతడట... బడికి... జర్దీ నడు... అగో.. ఇట్లు వచ్చింది...

తండ్రి : అమ్మా! పాలు...

ఇంటి స్త్రీ : బాబు! ఇంత లేట్‌గా వస్తే... ఎట్లా సరే గాని, ఇదిగో... ఈ రోజు ఫస్టు తారీఖు కదా, ఇదిగో నీ పాల డబ్బులు.

తండ్రి : ఎంతమ్మా...

ఇంటి స్త్రీ : నీవు పోయిన నెలలో 3 రోజులు లీటరు ఎక్కువ పోసినవ్, రెండు రోజులు రాలే.. అర లీటరు 3 సార్లు పోసినవ్... మొత్తం లెక్కజేయంగ ఇదిగో... 1880 రూ॥...

లెక్క సరిపోయిందిగా...

తండ్రి : గీ లెక్కలు, గిక్కలు మాకు యాడ అస్తయి అమ్మా... చదుకోకపోతిని... పోదాం... నడురా... (బయటకు వచ్చినాక...)

కొడుకు : నాన్నా! పాలకు తక్కువ పైసలు వచ్చినట్లు న్నయి గదనే...

తండ్రి : అట్లనే అనిపిస్తుంది రా...

కొడుకు : నేను సదుకుంటే గీ బాధలు వుండేవి కాదు... కదనే... అయ్యా! నేను బడికి వోతనే...

తండ్రి : సరే... లే... రా...

(పాట నేపథ్యం నుండి..)

"చదువు కుంటే బ్రతుకు
లెక్కలే తెలిసేవి
కష్టానికి ఫలము దక్కేది
మోసమ్ములు తెలిసి వచ్చేవి
అందుకే చదివించు పెద్దన్న
శ్రమ ఫలం సాధించు ఓరన్న"

### 5వ దృశ్యం

(పాఠశాల..... ప్రధానోపాధ్యాయుని గది...)

కొందరు లోపలికి వస్తూ...

రాజయ్య : నమస్కారం హెడ్ మాస్టరు గారు...

ప్ర.ఉ. : నమస్కారం.. ఏమిటీ అందరు ఇట్లా మీ పిల్లలతో సహ వచ్చినారు.

తల్లి : సారూ.. మీరు ఎన్నిసార్లు, మా ఇండ్లకు వచ్చి మా పిల్లలను బడికి పంపించమన్నా పంపలేదు... కానీ మాకు బుద్ధి వచ్చింది... మా పిల్లలను ఇంటి పనులు, బయట పనులు మాన్పించి మన బడిలోనే చేర్పిద్దామని వచ్చాం...

ప్ర.ఉ.: మంచి నిర్ణయం తీసుకున్నారు.... మీరు ఎందరికో ఆదర్శంగా నిలుస్తున్నారు. మీ పిల్లలు చదువుకొని వాళ్ళ జీవితాలను తీర్చిదిద్దుకుంటారు. సంతోషం... వెళ్ళి రండి... ఈ పిల్లలే రేపటి రోజున ఈ సమాజానికి వెలుగులను చూపిస్తారు!

అందరూ : నమస్కారం సర్... సెలవు....

(చదువుల పండగ 2003 ఆడియో క్యాసెట్ నుండి ప్రసారం అయినది. ఈ నాటిక నిజామాబాద్ ఆకాశవాణి ఎఫ్.ఎమ్. రేడియో కేంద్రం నుండి ప్రసారమైనది.)

– డా॥ కాసర్ల నరేశ్‌రావు
m : 94414 06252

బొమ్మలు : కైరంకొండ బాబు

## ఉపాధ్యాయులకు విజ్ఞప్తి




బాల చెలిమిలో గత కొన్ని నెలలుగా పిల్లల నాటికలను ప్రచురిస్తున్నాం ఇక ముందు కూడా ప్రచురించే ప్రయత్నం చేస్తాం. నాటికలు దృశ్య రూపాలు మీ పాఠశాల విద్యార్థులకు శిక్షణ ఇచ్చి ప్రదర్శన ఇప్పించండి. ప్రదర్శన వివరాలు, దర్శకత్వం, ప్రదర్శన ఫోటోలు, నటీనటుల పేర్లు, ఫోటోలు పంపితే బాల చెలిమిలో ప్రచురిస్తాం. సాహిత్య రంగంలో మీరిస్తున్న ప్రోత్సాహం దృశ్య రంగంలో కూడా ఇచ్చి పిల్లల్లోని నటనా సామర్థ్యానికి మెరుగులు దిద్దవలసిందిగా కోరుతున్నాం.

– బాలచెలిమి డెస్క్

పంచతంత్ర కథలు

# కోతి మొసలి కథ

పూర్వం ఒక నదీతీరంలో ఒకచోట ఒక పెద్ద నేరేడు. చెట్టు ఉంది. అది ఎప్పుడూ పండ్లతో నిండుగా, నది మీదికి వంగి అందంగా ఉండేది. ఆ చెట్టుమీద ఒక కోతి ఉంది. అది ఎంతో హాయిగా ఆ నేరేడుపళ్ళను తింటూ ఉండేది. ఒకరోజు ఒక మొసలి అక్కడికి వచ్చింది. ఆ కోతి దానికి కొన్ని నేరేడు పళ్ళను ఇచ్చింది. నేరేడు పళ్ళను తిన్న మొసలికి ఆ కోతితో మంచి స్నేహం కుదిరింది. రోజూ మొసలి వచ్చి కోతితో కబుర్లు చెపుతూ, కొన్ని నేరేడుపళ్ళు తిని, మరికొన్ని పళ్ళను తీసుకు పోయి తన భార్యకు ఇచ్చేది. ఒకరోజు ఆ మొసలి భార్య, "ఇంత తియ్యని నేరేడు పళ్ళను తినే ఆ కోతి గుండె ఇంకెంత రుచిగా ఉంటుందో! నాకు దాని గుండెను తినాలని ఉంది" అని అంది. ఆ మాటలు విన్న మగ మొసలి, కోతి తనకు మిత్రుడని, అతణ్ణి చంపకూడదని చెప్పింది. కాని ఆ మొసలి భార్య మొండిపట్టు పట్టింది. ఇక ఆ మొసలి చేసేదిలేక, తన గుండెను రాయి చేసుకుని ఆ కోతి గుండె కోసం బయలు దేరింది. కోతిని తన ఇంటికి విందుకి రమ్మని ఆ మొసలి బ్రతిమాలింది. తన వీపుపై ఎక్కించుకుని నీటిలో ఈదుతూ బయలుదేరింది. కానీ తెలివితక్కువ తనంతో, నది మధ్యలోకి రాగానే అసలు విషయం బయట పెట్టింది. తాను అపాయంలో చిక్కుకున్నట్లు కోతి గ్రహించింది. తెలివిగా, "అయ్యో! మిత్రమా! ఈ విషయం




నువ్వు నాకు ముందే ఎందుకు చెప్పలేదు? నేను నా గుండెను చెట్టు కొమ్మకి తగిలించి వచ్చాను. మనం బయలు దేరేటప్పుడే చెప్పితే నాతోపాటు తీసుకువచ్చేవాణ్ణి కదా!" అంది. అప్పుడు ఆ మొసలి ఆ కోతిని తిరిగి నేరేడు చెట్టు దగ్గరికి చేర్చింది. ఆ కోతి గబగబా చెట్టు ఎక్కి, "ఓరీ మూర్ఖా! గుండె శరీరంలో ఉండక ఇంకెక్కడ ఉంటుంది? పాపీ! భార్య చెప్పిన మాట విని మిత్రద్రోహం తలపెడతావా! నీ మాటలు ఇక నమ్మను. నీ స్నేహం ఇక నాకు వద్దు. నీ దారిన నువ్వు పో ఇక ఇక్కడికి రావద్దు!" అని ఆ మొసలికి చీవాట్లు పెట్టింది. మంచి స్నేహితుణ్ణి కోల్పోయినందుకు విచారిస్తూ మొసలి వెళ్ళిపోయింది.

**నీతి : నమ్మినవాణ్ణి మోసగించడాన్ని మించిన పాపం మరొకటి లేదు.**

సేకరణ : అమరావతి

కవిత

# అందాల సెలయేరు



అందమైనది సెలయేరు
అందరి మేలు ఇల కోరు
ఆటంకాలు ఎదుర్కొని
గమ్య స్థానం అది చేరు

రాయి రప్పలు ఎదురైన
మరో దారి చూసుకొనును
పంట పొలాలకు ప్రాణం
రైతన్నను ఆదుకొనును

కొండల్లో, కోనల్లో
జలజలమని ప్రవహించును
జీవకోటికి త్రాగు నీరు
సమృద్ధిగా అందించును

పరోపకారి సెలయేరు
త్యాగానికి మరో పేరు
ఎత్తైన ప్రదేశం నుంచి
దూకడమే దాని తీరు

– గద్వాల సోమన్న
ఎమ్మిగనూరు, కర్నూలు
m : 9966414580

# జమ్మి చెట్టు



పిల్లలూ...! బాగున్నారా! మనం గత సంచికలో మర్రి చెట్టు గురించి తెలుసుకున్నాం కదా. ఈ సంచికలో "జమ్మి" చెట్టు గురించి తెలుసుకుందాం.


'జమ్మి చెట్టు'నే "శమీ" వృక్షం అని కూడా అంటారు. జమ్మి చెట్టు అనగానే మనకు దసరా పండుగ గుర్తుకొస్తది కదా!. జమ్మి చెట్టు 'ఫాబేసి' కుటుంబానికి చెందినది. ఈ చెట్టును హిందువులు అత్యంత విశేషంగా పూజిస్తారు. దీని శాస్త్రీయ నామం ప్రొసోపిస్ సైసిజెరా. వైదిక భాషలో దీన్ని "ఆరణీ' అనే పేరుతో పిలుస్తారు. పాండవులు అజ్ఞాతవాస సమయంలో తమ ఆయుధాలైన బాణము, విల్లంబులను మూటగట్టి జమ్మి చెట్టు మీద దాచి పెట్టి, జమ్మి చెట్టు ను పూజించి వెళ్తారు. అలా అరణ్యవాసం ముగియగానే విజయదశమి రోజున చెట్టుకు పూజలు చేసి వారి ఆయుధాలను తీసుకొని కౌరవులతో జరిగిన యుద్ధంలో విజయం సాధించి రాజ్యాధికారం చేపడుతారు. ఇదంతా "మహాభారతం"లో ప్రస్తావన ఉంది. అందుకనే ఇక అప్పటినుండి తమకు కూడా విజయాలు వరించాలని దసరా పండుగ రోజున ప్రజలు జమ్మి చెట్టుకు "శమీ శమ యతే పాపం" ప్రార్థనా శ్లోకంతో మూడు ప్రదక్షిణలు చేసి అత్యంత భక్తి శ్రద్ధలతో పూజిస్తారు. విజయదశమి రోజున శుభ సూచకంగా "పాలపిట్ట"ను కూడా ప్రజలు చూస్తారు. అనంతరం శ్లోకం కలిగిన చీటిలపై కుటుంబ సభ్యుల పేర్లు రాసి వాటన్నింటిని చెట్టు మొదటన కుప్పగా పోసి కాల్చడం చేస్తారు. ఇలా చేయడం వల్ల పాపాలు పోతాయని ప్రజల నమ్మిక. తదుపరి జమ్మిఆకులు (పత్రం) తెంపుకుని ఒకరికి ఒకరు పంచుకుంటూ అలాయ్-బలాయ్ తీసుకుంటారు. పెద్దల ఆశీస్సులు పొందుతారు. దీని ఆకులను బంగారం గా భావిస్తారు. పూజ అనంతరం ఇండ్లకు వెళ్లి ఆకులను బియ్యంలో, కురాటి కుండలో, నీటి గాబులలో, దేవుని పటాల వద్ద వేసుకోవడం సంప్రదాయంగా భావిస్తారు. పండుగ తెల్లారి కూడా పెద్దవారికి, సహచరులకు దోస్తులందరికి కూడా జమ్మి బంగారంతో అలింగనం చేసుకుంటారు. అమృతం కోసం దేవుండ్లు పాలసముద్రాన్ని చిలికే సమయంలో దేవతా వృక్షాలు కూడా వచ్చాయని అందులో శమీ వృక్షం కూడా ఒకటని ఋగ్వేదంలో దీని ప్రస్తావన ఉంది. ఇంతటి ప్రాధాన్యత గల జమ్మి చెట్టు వల్ల ఎన్నో ఉపయోగాలు కూడా ఉన్నవి.

**జమ్మి చెట్టు వల్ల ఉపయోగాలు:**

* జమ్మి ఆకుల నుండి పసరు తీసి దాన్ని రాసుకుంటే కుష్టి వ్యాధి నయమవుతుంది.
* ఆకులను నూరి చెక్కర కలిపి సేవించడం వల్ల గర్భస్రావం జరగకుండా నిరోధించబడుతుంది.
* జమ్మి చెట్టు బెరడు దగ్గు, అస్తమా మొదలైన వ్యాధులకు ఔషధంగా పని చేస్తుంది.
* అవాంఛిత రోమాల నివారణకు జమ్మి ఆకులను ఉపయోగిస్తారు.
* ఆయుర్వేద మందుల్లో దీని ఆకు, పువ్వులు, విత్తనాలు, బెరడును ఉపయోగిస్తారు.
* జమ్మి చెట్టు ఆకులలో మిరియాలు వేసి నూరి వాడితే అతిసార వ్యాధి తగ్గుతుంది.

ఈ విధంగా ఎన్నో ఉపయోగాలు కలిగిన జమ్మి చెట్టును దసరా పండుగ రోజున ప్రజలు ఎంతో భక్తి శ్రద్ధలతో పూజించడం జరుగుతుంది.

- కోమటిరెడ్డి బుచ్చిరెడ్డి




m : 9441561655


కార్టూన్ కథ

# ధైర్యే సాహసే...

రచన, బొమ్మలు : శారద

ఏప్రిల్, 1991, బాలచెలిమి మాసపత్రిక నుండి...




అరె! వాళ్లు బీచ్‌వైపుగా వెళుతున్నారే! ఆ పెట్టెల్లో ఏముందో కనుక్కోవాలి
త్వరగా పదండి. పోలీసులుగాని చూస్తే చాలా ప్రమాదం!
పోలీసులకి భయపడుతున్నా రంటే వీళ్లు ఏ దొంగలో స్మగ్లర్లో అయ్యుంటారు. స్మగ్లర్లంటే దేశద్రోహులట కదా! ఇప్పుడు నేనేం చెయ్యాలి?
ఆ! టెలీఫోన్ బూత్! రాజు వాళ్ల డాడీ పోలీస్ ఇన్స్‌పెక్టరే కదా! అక్కడికి ఫోన్ చేస్తాను.
PUBLIC TELI PHONE BOOTH
రాజు వాళ్ల ఫోన్ నంబర్ ఎంతబ్బా? 6-4..... ఆ! 6-3-4-6-8
హలో! అంకుల్, నేను వేణుని. బీచ్ దగ్గర దొంగలు పెట్టెల్లో ఏదో తీసుకుపోతున్నారు. మీరు వెంటనే రండి.
అలాగా! వస్తున్నా!
అరే! వీళ్లు ఆ పడవలో వెళ్లి పోతున్నారే. వీళ్లని ఎలాగైనా కొంతసేపు ఆపాలి!
ఏయ్! ఆగు!
ఎవడ్రా నీవు?
వాళ్లు ముగ్గురూ కలిసి వేణుని చితకబాదారు.
కానీ, వేణు ప్రయత్నం ఫలించింది. సమయానికి పోలీసులు వచ్చి...
POLICE
మీవాడు మంచి ధైర్యవంతుడు సుమండీ!
అందరూ వేణుని మెచ్చుకొన్నారు
వేణు తర్వాత దేనికీ మరెప్పుడూ భయపడలేదు.
!
మిగతా పిల్లలు కూడా వేణుని మరెప్పుడూ దూరంగా ఉంచలేదు.

సమాప్తం.

# వారాలు




ఆదివారము నాడు
అరటి మొలచింది!
సోమవారము నాడు
సుడి వేసి పెరిగింది!
మంగళవారము నాడు
మారాకు తొడిగింది!
బుధవారము నాడు
పొట్టి గెల వేసింది
గురువారము నాడు
గుబురులో దాగింది!
శుక్రవారము నాడు
చూడగా పండింది!
శనివారము నాడు
చకచక గెల కోసి
అందరికి పంచితిమి
అరటి అత్తములు!
అబ్బాయి, అమ్మాయి
అరటి పండు ఇదిగో!

# గింజలు



నాన్న గింజలు తెచ్చాడు
అన్న మట్టిని తవ్వాడు
అమ్మ గింజలు నాటింది
నేను నీళ్ళను పోశాను
కొన్నాళ్ళకు అది చెట్టయింది
ఆరోగ్యానికి అది మెట్టయింది

– పిల్లల పాటల పరిమళం
తెలంగాణ సారస్వత పరిషత్తు

కథ

# ఇవాన్

## మాక్సిమ్ గోర్కీ



అనగనగా ఒక ఊరిలో ఇవాన్ అనే ఓ అందమైన యువకుడు ఉండేవాడు. చాలా అమాయకుడు. ఊరి వాళ్ళంతా అతన్ని 'వెర్రివెంగళప్ప ఇవాన్' అని పిలిచేవారు. ఇవాన్ ఓ రైతు వద్ద పనిలో చేరాడు. రైతు దంపతులిద్దరూ పట్టణానికి వెళ్తూ ఇవాన్‌తో ఇలా అన్నారు.

"పిల్లలకు భోజనం పెట్టి వాళ్ళని జాగ్రత్తగా చూసుకో". "వాళ్ళకు ఏం చేసి పెట్టమంటారు?" అడిగాడు ఇవాన్.

బంగాళ దుంపలతో సూప్ తయారు చేసి పెట్టమంది రైతు భార్య. "ఇంటిని ఓకంట కనిపెట్టు. పిల్లలు అడవిలోకి వెళ్ళకుండా జాగ్రత్తగా చూసుకో" అన్నాడు రైతు. వాళ్ళు పట్టణానికి బయలుదేరారు. ఇవాన్ గాఢనిద్రలో వున్న పిల్లలిద్దరినీ లేపాడు. వాళ్ళు నిద్రమత్తుతో లేచి కూర్చుని "మాకు బాగా ఆకలేస్తుంది" అన్నారు.

ఇవాన్ వెంటనే ఒక పెద్ద గిన్నె తీసుకొని దానిలో నీళ్ళు పోసి మరిగించి సగం బస్తా పిండిని వేశాడు. తరువాత కంగారుపడుతూ బిగ్గరగా అన్నాడు "ఇప్పుడు ఏమి చెయ్యాలి".

ఇది విన్న పిల్లలు బాగా కంగారుపడ్డారు. ఈ వెర్రి వెంగళప్ప మనల్ని ఏమైనా చేస్తాడేమో అని భయపడి తప్పించుకుని అడవిలోకి పారిపోయారు.

ఇవాన్ పొయ్యిమీద వున్న గిన్నె మంట తగ్గించి ఇలా ఆలోచించ సాగాడు. రైతు దంపతులు నాకు రెండు పనులు అప్పగించారు. మొదటిది పిల్లల్ని చూసుకోమని, రెండవది ఇంటిని కనిపెట్టుకొని వుండమని చెప్పారు. అయినా ఒక వ్యక్తి, ఒకేసారి రెండు పనులు ఎలా చెయ్యగలడు? ఎంత ఆలోచించినా ఉపాయం తట్టలేదు.

ఇవాన్ ఓ పథకం వేశాడు. "రైతు తలుపుని కనిపెట్టుకొని వుండమంటే దానర్థం పిల్లలు అడవిలోకి వెళ్ళకుండా వుండాలి. అలా అయితే ఆ తలుపుని నాతో తీసుకొని వెళ్తే, పిల్లలు ఎక్కడకీ వెళ్ళలేరు" అనుకున్నాడు. ఇంటిద్వారం నుండి చెక్క తలుపుని వేరు చేశాడు వెర్రివెంగళప్ప ఇవాన్. తలుపుని వీపు మీద పెట్టుకొని అడవికి బయలుదేరాడు.

అడవిలో ప్రయాణిస్తుండగా, అనుకోకుండా అతనికి ఓ ఎలుగుబంటి కనబడింది. "చెక్క తలుపుని ఎందుకు మోస్తున్నావ్?" అడిగింది ఎలుగుబంటి. జరిగినదంతా చెప్పాడు ఇవాన్. ఇవాన్ అమాయకత్వాన్ని చూసి, పొట్టపగిలేలా నవ్వింది ఎలుగుబంటి. ఆ ఆనందంలో కేరింతలు వేసింది.

"నేనిప్పుడు నిన్ను తినేస్తాను. వద్దులే మీ యజమాని పిల్లల్ని తినేస్తాను. మరోసారి పిల్లలు తల్లిదండ్రులు లేనప్పుడు, అడవిలోకి వెళ్ళడానికి ప్రయత్నించరు" అని మళ్ళీ గట్టిగా నవ్వింది ఎలుగుబంటి.

"నీలాంటి వెర్రివెంగళప్పని నేను ఇంతవరకు చూడలేదు. నిన్ను నా భార్యకు పరిచయం చేస్తాను. చెక్క తలుపుని ఈ పైన్ చెట్టుకింద వుంచు మా ఇంటి నుండి తిరిగివచ్చాక తీసుకోవచ్చు." అన్నది ఎలుగుబంటి. ఇవాన్ ఇలా సమాధానమిచ్చాడు "నేను మాట తప్పను. రైతు నన్ను ఈ తలుపుని గమనిస్తూ వుండమన్నారు. కాబట్టి నేను ఎక్కడికి వెళ్ళినా నాతో పాటు ఈ తలుపుని కూడా తీసుకొనివస్తాను." వాళ్ళు ఇక అడవిలో ప్రయాణం సాగిస్తూ ఎలుగుబంటి గుహను చేరారు.

ఎలుగుబంటి తన భార్యతో ఇలా అంది "మాషా! నేను నీకు పరిచయం చేయడానికి ఒకరిని తీసుకొచ్చాను. ఇతని పేరు వెర్రి వెంగళప్ప ఇవాన్. ఇతనిలాంటి అమాయకుడుని ఇప్పటివరకూ నేను ఎక్కడా చూడలేదు. మాషాతో ఇవాన్ ఇలా అన్నాడు "మీరు పిల్లల్ని చూశారా?"

"నా పిల్లలు గుహలో హాయిగా నిద్రపోతున్నారు" అంది మాషా.

"నన్ను ఒకసారి చూడనిస్తారా? వాళ్ళు రైతు పిల్లలైతే కాదు కదా" అన్నాడు ఇవాన్. మాషా అతనిని లోపలికి తీసుకొని వెళ్ళి, దాని ఎలుగు కూనల్ని చూపించింది.

ఇవాన్ ఇలా అన్నాడు "వీళ్ళు రైతు పిల్లలు కాదు ఎందుకంటే వాళ్ళ పిల్లలు ఇద్దరు, వీళ్ళు ముగ్గురు". ఇవాన్ అమాయకత్వం, తెలివితక్కువతనం మాషాకు అర్ధమై నవ్వుకుంది.

మాషా ఇలా అంది "రైతు పిల్లలేమో మనుషులు, మరి నా పిల్లలేమో ఎలుగు కూనలు కదా. వాళ్ళు వీళ్ళు ఒకేలా వుండరు". దానికి బదులుగా ఇవాన్ ఇలా అన్నాడు "చిన్న పిల్లలుగా వున్నప్పుడు అందరూ ఒకలాగే వుంటారు. వాళ్ళను గుర్తించడం కష్టం". మాషా ఇవాన్ మాటలకు ఆశ్చర్యపోయింది.

మాషా ఎలుగుబంటితో ఇలా అంది "మనం ఇతనికి హాని చెయ్యవద్దు, మనతోనే వుంచుకొని పనిలో పెట్టుకుందాం సరేనా?". సరేనని తలూపింది ఎలుగుబంటి.

ఇవాన్ మనిషి అయినప్పటికీ, అమాయకుడు కదా, అతని వల్ల మనకి ఎటువంటి హాని జరగదని నిర్ణయించుకున్నారు దంపతులిద్దరూ. మాషా, ఇవాన్కి బుట్టను ఇచ్చి ఇలా అంది. "అడవిలోకి వెళ్ళి, రాస్‌బెర్రీ పండ్లను బుట్టనిండా ఏరుకునిరా, నా కూనలు నిద్రలేవగానే వాటికి తినిపించాలి".

ఇవాన్ ఇలా అన్నాడు "సరేనండీ, మీరు ఈ తలుపుని జాగ్రత్తగా కనిపెట్టండి." ఇవాన్ దట్టమైన అరణ్యంలోకి వెళ్ళాడు. రాస్‌బెర్రీ చెట్లనిండా కాయలు వేలాడుతున్నాయి. ఇవాన్ ఆ పండ్లను కడుపు నిండా తిని, బుట్టనిండా కాయలను ఏరాడు. ఈ క్రింది విధంగా పాట పాడుతూ గుహకు బయలుదేరాడు.

చక్కటి అడవి, చిక్కటి అడవి
చిట్టిపొట్టి బుల్లి జంతువులు
చకచక గెంతే ఉడతలు
నిత్యం పనిలో ఎర్ర చీమలూ
ఎంతో రుచిగా రాస్ బెర్రీలు
చక్కటి అడవి చిక్కటి అడవి
ఆనందాలను పంచే అడవి

"రాస్‌బెర్రీ పండ్లు తెచ్చాను" అని గట్టిగా అరిచాడు ఇవాన్. ఈ మాటవిన్న ఎలుగుకూనలు తోసుకుంటూ ఇవాన్ దగ్గరకు వచ్చాయి. ఆకలితో వున్న కూనలు పండ్లను ఇష్టంగా తిన్నాయి.

ఆ దృశ్యం చూసిన ఇవాన్ ఇలా బాధపడ్డాడు "నా దురదృష్టం కొద్దీ నేను మనిషినై పుట్టాను, నేనూ ఎలుగుబంటినైతే నాక్కూడా ఇలాంటి బుజ్జి కూనలు వుండేవి".

ఇది చూసిన ఎలుగుబంటి దంపతులు ఇవాన్‌ను చూసి ఆనందించారు.

"మీరు ఈ తలుపుని జాగ్రత్తగా చూసుకోండి. నేను నా యజమాని పిల్లల్ని వెతుకుతాను" అన్నాడు ఇవాన్.

మాషా ఎలుగుబంటితో మీరూ ఇవానికి సహాయం చెయ్యండి. అసలే అతను చాలా అమాయకుడు కదా! ఇక ఇద్దరూ తిరుగు ప్రయాణమయ్యారు. వారి ప్రయాణంలో మరింత దగ్గరయ్యారు. ప్రాణస్నేహితుల్లా అన్నీ విషయాలు పంచుకున్నారు.

దారి మధ్యలో వాళ్ళకు చెట్ల పొదల్లో నిద్రిస్తున్న ఇద్దరు పిల్లలు కనిపించారు. "వాళ్ళేనా రైతు పిల్లలు" అడిగింది ఎలుగుబంటి. "నాకూ తెలియదు పిల్లల్నే అడుగుతాను. ఈ పిల్లలకి ఆకలిగా ఉందంటే వీళ్ళే రైతు పిల్లలు" అన్నాడు ఇవాన్. ఇవాన్ పిల్లలని నిద్రలేపి, మీకు ఆకలిగా వుందా అని అడిగాడు ఇవాన్. పిల్లలిద్దరూ 'అవును' అన్నారు.

"మిత్రమా నాకు సహాయం చేయగలవా? ఈ తలుపుని తీసుకొని నాతో కలసి రైతు ఇంటికి రాగలవా? నేను ఈ పిల్లలను తీసుకొనివస్తాను" అన్నాడు ఇవాన్.

"తప్పకుండా వస్తాను ఇవాన్" అంది ఎలుగుబంటి.

ఎలుగుబంటి, పిల్లలతో కలసి ఇవాన్ ఇంటివైపు అడుగులు వేశారు. వాళ్ళు ఇంటికి చేరేసరికి, రైతు దంపతులు ఇంట్లో వున్నారు. ఇల్లంతా గందరగోళంగా వుంది, ఇంటి ద్వారానికి తలుపు లేదు. పిల్లలను చూడగానే తల్లిదండ్రులు ఆనందంతో హత్తుకున్నారు.

ఏం జరిగింది ఇవాన్? అడిగారు రైతు దంపతులు. మీరు చెప్పినట్లే చేశాను అన్నాడు ఇవాన్ అమాయకంగా. "తలుపు ఏది? అడిగాడు రైతు. "నా మిత్రుడు తీసుకొని వస్తున్నాడు" సమాధానమిచ్చాడు ఇవాన్. రైతు దంపతులు కిటికీలో నుండి చూశారు. ఓ ఎలుగుబంటి, తన వీపుపై చెక్క తలుపుని మోసుకొని ఠీవీగా వస్తుంది. ఎలుగుబంటిని చూసిన కుక్కలు భౌ..భౌ.. అని అరుస్తూ బెదిరిపోయాయి. కోడిపుంజులూ భయంతో చెదిరి పోయాయి. ఊరి ప్రజలందరూ ఎలుగుబంటిని చూడడానికి గుంపులుగుంపులుగా వస్తున్నారు. కొందరు డాబాల మీద, చెట్ల పైకి ఎక్కి తలుపుని మోస్తున్న ఎలుగుబంటిని చూస్తున్నారు.

ఎలుగుబంటి తలుపుని రైతు దంపతులకు అప్పగించింది. వాళ్ళు దానిని చూసి భయపడ్డారు కానీ, పిల్లలు క్షేమంగా ఇల్లు చేరినందుకు సంతోషించారు. ఇవాన్ ఊరి చివరిదాకా వెళ్ళి తన మిత్రుడైన ఎలుగుబంటికి కృతజ్ఞతలు తెలిపి, వీడ్కోలు ఇచ్చాడు. వాళ్ళు ఇప్పటికీ మంచి మిత్రులు,చూశారా పిల్లలూ! స్నేహం అంటే ఇదే మరి!

**స్వేచ్ఛానువాదం : అనిల్ బత్తుల**
m : 8179273974

ఇంగ్లీష్ : ఇవాన్ ది ఫూల్ ● రైటర్ : మాక్సిమ్ గోర్కీ
ఇంగ్లీష్ అనువాదం: గాలీన గ్లాగోలేవ ● బొమ్మ: యురి మొలకనోవ్

సైన్సు

# శబ్దవేధి



కళ్లకు గంతలు కట్టుకుని, శబ్దం ఎటువైపు నుంచి వస్తోందో జాగ్రత్తగా విని, ఆ శబ్దం చేసిన వస్తువును బాణంతో – లేదా కత్తితో – కొట్టగల ప్రతిభను "శబ్దవేధి" అంటారు. శబ్దం ఎటు నుంచి వస్తుందో చెప్పగల శక్తి కాస్తో కూస్తో మన కందరికీ ఉంది. ఇది నిజమో కాదో చూడడానికి ఒక చిన్న గమ్మత్తు చెయ్యవచ్చు. దీనికి కావలసిన పరికరాలు రెండే రెండు చమ్చాలు.

చూపుడు వేలును తన కుడి చెవిలో బిరడాలాగ దూర్చుకుని, కళ్లు మూసుకుని, నిలబడమని నీ స్నేహితురాలితో చెప్పు. నువ్వు ఆమె వెనుక నిలబడి, రెండు చెమ్చాలు చెరో చేతితోనూ పట్టుకుని, ఒకదాని మీద ఒకటి కొట్టి శబ్దం చెయ్యి. ఆ ధ్వని ఏ వైపు నుంచి వస్తోందో ఎడమ చేతితో ఆమె చూపగలగాలి. ఇంతకన్న మరేమీ లేదు.

కానీ, నీ స్నేహితురాలు ఇంత చిన్న విషయాన్ని కనిపెట్టలేక తబ్బిబ్బు పడిపోతుంది. మూసి ఉన్న చెవి ప్రాంతాల్లో శబ్దం చేస్తే తెరిచి ఉన్న చెవి వైపు నుంచి చప్పుడు వచ్చినట్లుగా ఆమె భ్రమపడుతుంది.

ఇంత చిన్న విషయం గ్రహించడానికి ఇంత కష్టం ఎందుకు అవుతుందో తెలిసిందా?

కేవలం శబ్దాన్ని వినడానికే అయితే ఒక్క చెవిచాలు; ఆ శబ్దం వస్తున్న దిశను నిర్ణయించడానికి అయితే రెండు చెవులు అవసరం. రెండు చెవులతోనూ ఏక సమయంలో వింటేనే గాని శబ్ద దిశా నిర్ణయం సాధ్యం కాదు; అందులోనూ శబ్దం ఒక మూల నుంచి వస్తూంటే మరీనూ. శబ్దం వస్తున్న దిశకు దగ్గరలో ఉన్న చెవికి ధ్వని బిగ్గరగానూ, రెండవ చెవికి కాస్త మందంగానూ వినిపిస్తుంది. రెండు చెవులూ వేరు వేరుగా అందిస్తున్న సమాచారాన్ని నీ మెదడు అందుకుని, రెండు చెవుల శబ్దాలనూ బేరీజు వేసుకుని, ఏ శబ్దం అధికంగా ఉందో నిర్ణయించుకుని, ఏ దిక్కు నుంచి వచ్చిందో గ్రహిస్తుంది. ఒక చెవిని మూసేస్తే నీ మెదడుకి ఒకే ఒక చెవి పంపిన శబ్దం సమాచారం మాత్రమే అందుతుంది. పోల్చి చూడడానికి రెండవ చెవి తాలూకు సమాచారం లేదు కాబట్టి ఆ శబ్దం ఏ వైపు నుంచి వస్తోందో నిర్ణయించలేక తికమక పడిపోతుంది. కళ్లు రెండు ఉండడానికి కూడా ఇంచుమించు ఇదే కారణం. రెండు కళ్లతో ఏక సమయంలో చూస్తే తప్ప ఆ వస్తువు ఎంత దూరంలో ఉందో మన మెదడు సరిగ్గా నిర్ణయించలేదు.

ఇంతకీ చెప్ప వచ్చేదేమిటంటే మనకి రెండేసి చెవులూ, రెండేసి కళ్లూ ఉండడం అందం కోసమూ కాదు, ఒకటి ప్రమాదానికి గురి అయిపాడైపోతే రెండవది అయినా ఉంటుంది లెమ్మని కాదు. వింటున్న శబ్దపు దిశను నిర్ణయించడానికీ, కనిపిస్తున్న వస్తువుల దూరాలను నిర్ణయించడానికీ రెండు చెవులూ, రెండు కళ్లూ అవసరం.


– డాక్టర్ మహీధర నళినీ మోహన్

'ప్రతి ఇంటా ప్రయోగశాల' నుండి

# ప్రాణ స్నేహితులు

మేము ముగ్గురు స్నేహితులం ఉండేవాళ్లం, మేము ఎప్పుడూ కలిసిమెలిసి ఉండేవాళ్ళం. ఒఏకరికి కష్టం వచ్చినా సరే ఆ కష్టాన్ని ముగ్గురం కలిసి పంచుకునే వారం, ఒకరికి సంతోషం వచ్చినా ముగ్గురం పంచుకునే వాళ్లం. కానీ ఒకరోజు మా స్నేహితురాలికి ఒక కష్టం వచ్చింది. ఆ కష్టం ఏమిటంటే, “మా స్నేహితురాలు వాళ్ళ నాన్నగారు పాఠశాలకు వెళ్ళడం మానేయ మన్నారు”. ఎందుకంటే వాళ్ళ కుటుంబంలోని ఆర్థిక పరిస్థితుల వల్ల పాఠశాల ఫీజులు కట్టలేనందు వలన, వాళ్ళ అమ్మానాన్నలు కష్టం చేసినప్పటికి వాళ్ళు చేసిన కష్టం కుటుంబానికే సరిపోవడం లేదు. కాబట్టి మా స్నేహితురాలిని పాఠశాలకు వెళ్ళడం మానేయమన్నారు. తనను కూడా వాళ్ళవెంబడి కూలీపనికి తీసుకొని వెళ్ళాలనుకున్నారు. కాని వాళ్ళ అమ్మానాన్నలను ఒప్పించి మా స్నేహితురాలిని బడికి తీసుకరావాలను కున్నాం. మేము స్నేహితురాలి వాళ్ల ఇంటికి వెళ్ళి వాళ్ళ నాన్నగారితో బడికి పంపించమని అడిగాము. కానీ వాళ్ళ నాన్నగారు ఇంట్లో ఆర్థిక పరిస్థితులు బాగోలేనందువలన పంపించలేము అన్నారు.

కానీ మేము, జ్యోతి సావిత్రీబాయి పూలే గురించి చదవడం వల్ల ఆమె గురించి తెలిసింది. ఆమె ఎంతోమంది విద్యార్థులకు చదువు నేర్పించింది. కానీ,



ఆమె కూడా ఒక మధ్యతరగతి కుటుంబంలోనే జన్మించింది. ఎంతో మంది విద్యార్థులకు ఉచితంగా విద్యను నేర్పించి ఆదర్శవంతురాలుగా నిలిచింది. అందుకే అన్నారు "ఆడపిల్ల చదువు అవనికి వెలుగు" అని. ఒక ఆడపిల్ల చదివితే ప్రపంచానికే వెలుగు అని చాటి చెప్పారు. విద్యార్థులకు మొదటి గురువు ఎవరంటే 'అమ్మ' అని చెప్పాలి. ఇలా ఎంతో మంది గొప్పవాళ్ళ గురించి చెప్పి వాళ్ళ అమ్మానాన్నలను ఒప్పించాము. మా స్నేహితురాలి ఫీజు కూడా మేమే కడతామని చెప్పి మా పాఠశాలకు తీసుకువెళ్ళాము. మా స్నేహితురాలు పాఠశాలకు వచ్చినందుకు మాకు ఎంతో సంతోషంగా ఉంది. మేము మంచిగా చదివి గొప్పస్థాయికి రావాలనుకున్నాము దానికి తగినంత కృషి చేసి పట్టుదలతో మేము అనుకున్నది, సాధించి ఒక గొప్పస్థాయిలోకి ముగ్గురము ఎదిగాము. దానికీ కారణం మా స్నేహితురాలి అమ్మానాన్నలు మా స్నేహితురాలిని పాఠశాలకు పంపినందుకు మేము ముగ్గురం విద్యను ఇష్టంగా చదివాము. అందుకే ఈ రోజు మేము ఒక గొప్పస్థాయిలో ఉన్నాము. మా స్నేహితురాలి వాళ్ళ అమ్మానాన్నలు మా దగ్గరికి వచ్చి, మమ్మల్ని ఒప్పించి, మీరు ఆ రోజు మా అమ్మాయి పాఠశాలకు తీసుకెళ్ళి నందువల్లే ఈ రోజు మా అమ్మాయిని ఇంత గొప్ప స్థాయిలో ఉంది. ఆమెని ఇలా చూస్తామని అనుకోలేదు. అని కృతజ్ఞతలు చెప్పారు. ముగ్గురము ఎంతో సంతోషంగా చదివి మా కాళ్ళ మీద మేము నిలబడగల స్థాయికి వచ్చాము. ఆ ముగ్గురి పేర్లు చెప్పలేదు కదూ అంజలి, ఉషారాణి, రాజేశ్వరి.

**నీతి: కష్టాలలో ఉన్నప్పుడు ఆదుకున్నవాడే నిజమైన స్నేహితుడు.**

– హిందు

9వ తరగతి, జెడ్‌పిహెచ్‌ఎస్,
కొల్లంపల్లి, నారాయణ పేట

శతకం


# వేమన పద్యాలు

**విద్యలేనివాడు విద్యాధికుల చెంత**
**నుండి పండితుండుకాడు**
**కొలని హంసలకడఁగొక్కెర యున్నట్లు!**
**విశ్వదాభిరామ వినురవేమ**

తాత్పర్యం : కొలనులో హంసల నడుమ కొంగ ఉన్నా, దాని జాతి భేదం గుర్తింపబడినట్లే, విద్యావంతుల మధ్య అవివేకి ఉన్నా వానికి వివేకం కలుగదు.

**ఇనుము విఱిగెనేని ఇనుమరు ముమ్మారు**
**కాచి యతక వచ్చు గ్రమము గాను**
**మనసు విఱిగెనేని మఱి చేర్చ రాదయా**
**విశ్వదాభిరామ వినురవేమ**

తాత్పర్యం : ఇనుము విరిగితే దానిని రెండు మూడు సార్లు అతికించవచ్చు. కానీ అదే మనిషి మనసు ఒక సారి విరిగితే (అంటే ఏదైనా విషయం వల్ల మనసు నొచ్చుకుంటే) దానిని మరల అతికించుట ఆ బ్రహ్మ దేవిని వల్ల కూడా కాదు.



# కూరగాయలు



| | వృక్షం | శాస్త్రీయ నామం | తెలుగు పేరు |
|---|---|---|---|
| 1) | Cucumber | Cucumis sativus | దోస |
| 2) | Curry Plant | Murraya Koenigii | కరివేప |
| 3) | Bitter Gourd | Momordica Charantia | కాకరకాయ |
| 4) | Broccoli | Brassica Oleracea Italica | బ్రకోలి |
| 5) | Cabbage | Brassica Carinata | క్యాబేజి |
| 6) | Cauliflower | Brasica Oleracea | కాలిఫ్లవర్ |
| 7) | Cluster bean | Cyamopses Tetragonoloba | గోరుచిక్కుడు |
| 8) | Coriander | Coraindrum Sativum | ధనియాలు |
| 9) | Drum Stick | Moringa Oleifera | మునగ |
| 10) | Brinjal | Solanum Melongena | వంకాయ |
| 11) | Garlic | Allium Sativum | ఎల్లిగడ్డ |
| 12) | Mint (Pudina) | Menta Arvensis | పుదీనా |
| 13) | Onion | Allium Cepa | ఉల్లిగడ్డ |
| 14) | Papaya | Carica Papaya | బొప్పాయి |
| 15) | Pumpkin | Cucurbita Maxima | గుమ్మడి |
| 16) | Soyabean | Glycine Max | సోయాచిక్కుడు |
| 17) | Spinach | Spinacia Oleracea | పాలకూర |
| 18) | Tomato | Solanum lycopersicum | టమాట |
| 19) | Carrot | Daucus Carota | కేరట్ |



– 'ఆరోగ్యం – విజ్ఞానం' తెలంగాణ సారస్వత పరిషత్తు నుండి...

జంతువు

# టార్డిగ్రేడ్



టార్డిగ్రేడ్‌లు (Tardigrada) నీటి రాఖాల లేదా మాస్ పిగ్లెట్స్ అని పిలుస్తారు. టార్డిగ్రేడ్‌లు ఒక చిన్న అకశేరుకలు. 1773లో జర్మన్ పాస్టర్ J.A.E. గోయిజ్ మొదటగా వివరణ ఇచ్చాడు. 1776లో ఇటాలియన్ జీవ శాస్త్రజ్ఞుడు లాజ్జారో స్పాలాంజాని "స్లో స్టెప్పర్" అనే అర్థం కలిగిన టార్డిగ్రాడాగా నామకరణం చేశారు. టార్డిగ్రేడ్‌లు ఫైలమ్ టార్డిగ్రాడాకు చెందినవి. టార్డిగ్రేడ్‌లు 1,100 పైగా జాతులను కలిగి ఉంటాయి. ఇవి ఆర్థ్రోపోడ్‌ల (కీటకాలు, క్రస్టేసియన్లు) రకానికి చెందినవిగా పరిగణిస్తారు.

**పరిమాణం:** టార్డిగ్రేడ్‌లు సాధారణంగా 1 మిమీ (0.04 అంగుళాలు) లేదా అంతకంటే చిన్నవి. **ఆవాసాలు:** తడిగా ఉన్న నాచులు, పుష్పించే మొక్కలు, ఇసుక, మంచినీరు, సముద్రం. **శరీర నిర్మాణం:** నాలుగు ఫ్యూజ్డ్ విభాగాలు. ప్రతి విభాగం బలమైన, పొట్టి అవయవాలను కలిగి ఉంటుంది. ప్రత్యేకంగా ప్రసరణ లేదా శ్వాసక్రియ అవయవాలు ఉండవు. శరీర కుహరం రక్తం మరియు ఆక్సిజన్‌ను రవాణా చేసే ద్రవంతో నిండి ఉంటుంది. **ఆహారపు విధానం:** మొక్కలను తినడానికి ప్రత్యేకమైన స్టైల్‌లు ఉంటాయి, ఇవి మొక్కల కణాలను కుట్టి, సెల్ కంటెంట్‌ను పీల్చుతాయి. కొన్ని జాతులు మాంసాహారిగా ఉంటాయి. **పునరుత్పత్తి:** టార్డిగ్రేడ్‌లు లైంగిక (హెర్మాఫ్రొడిటిజం) లేదా అచ్ఛిద్ర పునరుత్పత్తి (పార్థినోజెనిసిస్) ద్వారా పునరుత్పత్తి చేయగలవు. గుడ్లు అలిమెంటరీ కెనాల్ చివర లేదా పాయువు ముందు ఓపెనింగ్ ద్వారా విడుదల అవుతాయి. **ఆసక్తికర విషయాలు:** టార్డిగ్రేడ్‌లు అననుకూల పరిస్థితులలో "ట్యూన్" స్థితిలోకి వెళ్ళగలవు. **టార్డిగ్రేడ్‌ల ప్రత్యేకతలు: తట్టుకునే సామర్థ్యం:** టార్డిగ్రేడ్‌లకు అత్యంత విశేషమైన లక్షణం వాటి తట్టుకోగల సామర్థ్యం. ఇవి చాలా తక్కువ ఉష్ణోగ్రతలు (-272°C లేదా-458°F) మరియు తీవ్ర ఎండబెట్టడం వంటి కష్టమైన పరిస్థితులను తట్టుకోగలదు. **ట్యూన్ స్థితి:** అననుకూల పరిస్థితులలో, టార్డిగ్రేడ్‌లు "ట్యూన్" అని పిలువబడే సస్పెండ్ యానిమేషన్ స్థితికి వెళ్తాయి. జీవ శక్తి యొక్క పోషక మధురమైన సుగంధాన్ని తయారు చేస్తుంది. నూనెలో నివసించినప్పుడు ఆ నూనెను నీటిగా మారుస్తుంది. ఈ సమయంలో వాటి శరీరం ఎండి పోయి నిర్జీవమైనట్లుగా కనిపిస్తుంది, మరియు జీవక్రియ 0.01%కు తగ్గుతుంది. **కాలంలో బ్రతికే సామర్థ్యం:** ఈ ట్యూన్ స్థితిలో, టార్డిగ్రేడ్‌లు సంవత్సరాల లేదా దశాబ్దాల పాటు జీవించగలుగుతాయి. అదనంగా, 21 నెలల పాటు -190°C వద్ద ద్రవ గాలిలో ఉంచిన నమూనాలు 40% పునరుద్ధరించబడ్డాయి. టార్డిగ్రేడ్‌లు పరిసరాల ఒత్తిళ్లకు అనుగుణంగా ఉండడానికి క్రిప్టోబయోసిస్ అనే ప్రక్రియను అనుసరిస్తాయి. **క్రిప్టోబయోసిస్ రకాల :** అహైడ్రోబయోసిస్ (నీటి లోపం), క్రియోబయోసిస్ (తక్కువ ఉష్ణోగ్రత), ఒస్మోబయోసిస్ (ఉప్పు నీటిలో పెరిగిన సాల్యూట్ కేంద్రీకరణ), అనోక్సీబయోసిస్ (ఆక్సిజన్ లోపం) **శూన్యంలో నిల్వ:** ఎనిమిది రోజుల పాటు శూన్యంలో ఉంచిన నమూనాలు, గది ఉష్ణోగ్రత వద్ద హీలియం వాయువులో జీవం పొందగలుగుతాయి. ఈ లక్షణాలు కలిగిన టార్డిగ్రేడ్‌లు భూమి మీద అత్యంత అద్భుతమైన జీవులలో ఒకటిగా పరిగణిస్తారు.

– సచిన్ కోత్వాల్
బాలచెలిమి డెస్క్, m : 8686664949

## చెలిమి క్లబ్

చెలిమిక్లబ్‌లో సభ్యత్వం తీసుకోండి
లాభాలు పొందండి.

1. చిల్డ్రన్స్ ఎడ్యుకేషనల్ అకాడమీ ప్రచురించే పుస్తకాలపై ప్రత్యేక తగ్గింపు.
2. మీ ప్రతి పుట్టిన రోజుకు అభినందనలతో అందమైన గ్రీటింగ్ కార్డు.
3. మీలో ఉన్న టాలెంట్‌ను అభివృద్ధి చేసుకోవడానికి క్లబ్ నిర్మాణాత్మక సహకారం అందిస్తుంది.
4. మీ స్కూల్లో, ఊర్లో పిల్లల కార్యక్రమాల వార్తలను చెలిమి సమాచారపత్రికకు పంపడానికి మీరు విలేఖరిగా ఉండవచ్చు.
5. అందమైన మెంబర్‌షిప్ బ్యాడ్జి.
6. మిమ్మల్ని ఆశ్చర్యపరచే బహుమతులు.

### చెలిమి క్లబ్

పేరు : ----------------------

తండ్రి పేరు : ----------------------

పుట్టినతేదీ : ----------------------

చిరునామా : ----------------------

----------------------

----------------------

పిన్ : ----------------------


హాబీలు : ----------------------

మొబైల్ : ----------------------


ఇ-మెయిల్ : --------------------

ఈ వివరాలతో మెయిల్ చేయండి.

బాల చెలిమి ఇ-మెయిల్ :
desk.chelimi@gmail.com



# గాలి మార్పు, దాని ప్రభావం




కచ్చితమైన భూమికి ఒక వ్యక్తి చేసిన సహాయం ప్రపంచవ్యాప్తంగా వాతావరణ మార్పు ఒక ముఖ్యమైన సమస్యగా భావిస్తున్నారు. ఇది ప్రాముఖ్యంగా గ్రీన్‌హౌస్ వాయువుల పెరుగుదల వల్ల జరుగుతుంది, ఇది మనుషులు చేస్తూ ఉన్న కర్మలు, ఫోసిల్ ఇంధనాలు కాల్చడం, చెట్లు కొట్టడం, ఇతర నాశక పద్ధతులు. దీని వల్ల తీవ్ర వాతావరణ మార్పులు, సముద్ర స్థాయి పెరుగుదల, పర్యావరణానికి హానికరం అవుతున్నాయి. సర్కారులు, సంస్థలకు పెద్ద బాధ్యత ఉన్నా, ప్రతి వ్యక్తి వాతావరణ మార్పును తగ్గించడానికి చాలా చేయవచ్చు. తక్కువ శక్తిని ఉపయోగించడం, పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్‌ను ఉపయోగించడం, రీసైక్లింగ్ చేయడం, నీటిని సేవ్ చేయడం వంటి సులభమైన మార్గాలు పెద్ద మార్పు తీసుకువస్తాయి. పర్యావరణాన్ని పరిగణనలోకి తీసుకుని తయారైన ఉత్పత్తులను కొనడం, పర్యావరణ పరిరక్షణ గురించి అవగాహన పెంచడం మరింత ప్రభావం చూపుతుంది. ఇదన్నీ కాకుండా, మాంసం తినడం తగ్గించడం, చెట్లు నాటడం, ప్లాస్టిక్ వాడకం తగ్గించడం వంటి జీవన శైలిని మార్చుకోవడం కూడా ముఖ్యం. మనము ఎప్పుడు పర్యావరణానికి అనుకూలమైన ఎంపికలు చేస్తామో, మనతో ఉన్న ఇతరులను కూడా అదే చేయాలని ప్రేరేపిస్తామో, మనందరం కలిసి కార్బన్ ఫుట్‌ప్రింట్‌ను తగ్గిస్తాము. ప్రతి చిన్న మార్పు ఒక గొప్ప లక్ష్యానికి-మన ప్రపంచానికి ఆరోగ్యకరమైన, నిలకడైన భవిష్యత్తుకు, కదలికగా ఉంటుంది.

ఎమ్. గీతికా
ఆక్స్‌ఫర్డ్ గ్రామర్ స్కూల్, హిమాయత్‌నగర్, హైదరాబాద్.




# బతుకమ్మ – దసరా

**తాతయ్య :** ఏమిటి తేజా? చాలా ఉషారుగా ఉన్నావ్? ఏమిటి విశేషం?

**తేజ :** ఏమి లేదు తాతయ్య మాకు "బిగ్ లీవ్స్ ఫెస్టివెల్" రాబోతుంది.

**తాతయ్య :** ఏడ్చినట్టుంది నీ భాషా నైపుణ్యం... కొత్తగా చెప్పాలి అనుకుంటే హాయిగా "పెద్ద సెలవుల పండుగ" అనవచ్చుగా!?

**తేజ :** ఏదోలే! మేము మీ అంత తెలుగు లవర్స్‌మి కాదులే!

**తాతయ్య :** సరేగాని ఇన్ని ఎక్కువ సెలవులు వచ్చే ఈ పండుగ పేరేమిటో? ఎందుకు చేస్తారో తెలుసా?

**తేజ :** మీరు చెప్పందే మాకు ఎలా తెలుస్తుంది?

**తాతయ్య :** అయితే అలా కూర్చో వివరంగా చెబుతాను.

**తేజ :** సరే తాతయ్య చెప్పు.

**తాతయ్య :** మన తెలుగు నెలల్లో ఒకటైన "ఆశ్వీయుజ మాసంలో మొదటి పది రోజులు ఈ పండుగ చేస్తారు.

**తేజ :** దీనిని దశరా పండుగ అంటారు అందుకేనా?

**తాతయ్య :** ఔను. విజయదశమి, దేవీ నవరాత్రులు, శరన్నవరాత్రులు అంటారు అలాగే ప్రపంచంలోనే ఎక్కడా జరగని విధంగా తెలంగాణ రాష్ట్రంలో పువ్వులను పూజించే బతుకమ్మ పండుగ కూడా ఈ పది రోజుల్లోనే చేస్తారు.

**తేజ :** భలే ఉందే. ఈ రెండు పండుగల గురించి కాస్త నాకు క్లియర్‌గా చెప్పవా?

**తాతయ్య :** మీరంతా అనే ఎనర్జీ అనబడే శక్తిని పూజించడమే ఈ పండుగల్లోని పరమార్థం. ఆధ్యాత్మికంగా ఆ శక్తికి "దుర్గా మాత"

అవతారాలుగా చెబుతూ రోజుకో అవతార రూపంగా అలంకరించి పూజిస్తారు.

తేజ : పూజించడం అంటే గౌరవించడమే కదా? మనం పని చేయడానికి శక్తి అవసరం. అది లేకుండా మనం ఏ పని చేయలేం కాబట్టి దానిని గౌరవించడం కరెక్టే మరి ఈ కాలంలోనే ఈ పూజలు ఎందుకు చేయాలి?

తాతయ్య : చాలా చక్కని ప్రశ్న అడిగావ్. శక్తికి ప్రతి రూపం మన ప్రకృతి. మరో విధంగా చెప్పాలి అంటే ప్రకృతిని కృతజ్ఞతా పూర్వకంగా పూజించడమే ఈ దసరా పండుగలోని అంతరార్థం. వర్షాకాలం అనే వర్షఋతువు ముగిసి ప్రకృతి అంతా ప్రశాంతంగా ఆకాశం అంతా అందంగా ఉండే ఈ శరత్ ఋతువు ప్రారంభంలోనే ఈ పండుగ చేస్తాము.

తేజ : ఈ పండగ ఎప్పటి నుంచి మొదలైంది తాతయ్యా?

తాతయ్య : శక్తిని పూజించే ఆచారం ప్రాచీన కాలం నుంచి ఉంది. రామాయణంలో రాముడు రావణుని అంతం చేసి విజయం సాధించినందుకు ఈ పండగ చేసినట్టు, భారతంలో పాండవులు అజ్ఞాతవాసం పూర్తి చేసుకుని తాము జమ్మిచెట్టు మీద దాచిన బాణాల సాయంతో ఉత్తర గోగ్రహణంలో విజయం సాధించింది ఈ రోజునే అని అందుకే ఈ రోజున శమి వృక్షం అనబడే జమ్మిచెట్టును పూజించడం శక్తికారకాలైన ఆయుధాలను పూజించడం కూడా ఆనవాయితీగా వస్తుంది.



తేజ : అంటే రామాయణ, భారత కాలాల్లోనే ఈ పండుగ చేసుకున్నారన్న మాట. మరి బతుకమ్మ పండగ?

తాతయ్య : ఇది కేవలం తెలంగాణ ప్రాంతంలోని పల్లె పడుచులకు సొంతమైన పూల పండగ. ప్రకృతికి మూలమైన శక్తినే గౌరి. బతుకమ్మ అనే పేర్లతో పిలుస్తూ ఆ పండగ చేసుకుంటారు. దీనికి సంబంధించిన పురాణ ఇతిహాసాల ఆనవాళ్లు లేకపోయినా ఇది ప్రాచీన చరిత్ర గల పండుగే!

తేజ : వస్తువు ఒకటే అయినా ప్రాంతాలను బట్టి వేరు వేరు పేర్లతో పిలిచినట్టు పండుగలను కూడా ప్రాంతాలను బట్టి రకరకాలుగా పిలుస్తారా?!

తాతయ్య : అన్నట్టే. ఈ బతుకమ్మ పండగలో పూలకు పాటలకు అధిక ప్రాధాన్యత ఉంటుంది. ఈ కాలంలో దొరికే పూలనే ప్రకృతి ప్రతిరూపంగా అందంగా అలంకరించి పూజిస్తారు.

తేజ : పాటల ప్రాధాన్యత ఏమిటి తాతయ్య వెరైటీగా...?

తాతయ్య : జానపద బాణీలో ఉండే ఈ పాటల్లో ఎన్నో వీర గాథలు పురాణ కథలు ఉండి అవి అన్నీ పాడే, ఆడే స్త్రీలకు మనోధైర్యం పెంచుతాయి. అంతేకాదు అందరిలో



ఐకమత్యం స్నేహభావం పెరగడానికి ఆరోగ్యానికి ఈ పండగ ఎంతో దోహద పడుతుంది.

తేజ : అందరు కలిసి చేసుకుంటారు కాబట్టి అందరిలో యూనిటి వస్తుంది. మరి ఆరోగ్యం ఎలా వస్తుంది తాతయ్య?

తాత : ఈ దేవి నవరాత్రులు, బతుకమ్మ పండుగల్లో ఈ కాలంలో దొరికే ఆహార ధాన్యాలతో రోజుకో రకం నైవేద్యం పెట్టి ఫలహారంగా తినడం వల్ల శరీరానికి ఎంతో శక్తి రావడమే గాక ఆరోగ్యం కూడా వస్తుంది. ఇక పూల బతుకమ్మ చుట్టూ చప్పట్లు కొడుతూ చిరునృత్యాలు చేస్తూ పాటలు పాడటం వల్ల శరీరానికి ఎంతో వ్యాయామం జరిగి ఆరోగ్యం కలుగుతుంది.

తేజ : అబ్బో ఈ పండుగల్లో కనిపించని ఇన్ని లాభాలున్నాయా?

తాత : ఆరోగ్యమే కాదు కొందరికి ఆర్థిక లాభం కూడా ఉంటుంది.

తేజ : అదేలా తాతయ్య? నువ్వు అన్ని భలే వెరైటీగా చెబుతున్నావు.

తాత : కాలంతో పాటుగా పండుగలు చేసుకోవడంతో కొన్ని మార్పు చేర్పులు వస్తున్నా అసలు అంతరార్థం మారదు. మీకు ఇప్పుడు దసరా అంటే ఎక్కువ రోజులు సెలవులు వచ్చే పండగ అయిపోయింది. కాని మా చిన్నతనంలో దసరా వస్తే చాలా పంతుళ్లతో కల్సి ఇల్లిల్లు తిరిగి పాటలు పాడుతూ ఇంటివారు అయ్యవార్లకు ఇచ్చే డబ్బులు పిల్లలకు ఇచ్చే పప్పు బెల్లాలు తింటూ సరదగా ఉండేది. ఆనాటి గురువుల ఆర్థిక లేమితో అప్పుడు ఆ ఆచారం ఉండేది నేడు ఆర్థిక పరిస్థితులు మారాయి ఆచారం మారింది.

తేజ : కాని ఇప్పుడు దసరా డబ్బులు వసూలు చేస్తున్నారు కదా?

తాత : ఔను నేటికాలంలో అలా వసూలు చేసుకుంటున్నారు. ఈ పండగ పది రోజులు దుర్గాదేవి పూజా మండపాల వద్ద రాత్రిపూట నాటకాలు, బుర్రకథలు, హరికథలు చెప్పే కళాకారులే గాక పగటి పూట "పగటి వేషగాళ్లు" అనే కళాకారులు విచిత్ర వేషాలు ధరించి ఆనందాన్ని, హాస్యాన్ని, విజ్ఞానాన్ని అందించి అందుకు గాను కానుకల రూపంలో డబ్బులు పొందేవారు.

తేజ : దసరా అంటే ఏమో అనుకున్న. ఇంత చరిత్ర ఇన్ని లాభాలున్నాయా? థాంక్స్ తాతయ్య.


తాత : మంచిది మనవడా ఈ విషయాలు మీ ఫ్రెండ్స్‌కు చెప్పు.

తేజ : అలాగే తాతయ్య వస్తాను.

– డా. అమ్మిన శ్రీనివాసరాజు

m : 7729883222

# నాభి కథ




మన బొడ్డు బటన్ (NABHI) అనేది మన సృష్టికర్త మనకు అందించిన అద్భుతమైన బహుమతి. 62 ఏళ్ళ వ్యక్తికి ఎడమ కంటికి చూపు సరిగా లేదు. అతను రాత్రిపూట ప్రత్యేకంగా చూడలేదు. అతని కళ్ళు మంచి స్థితిలో ఉన్నాయని కంటి నిపుణులు చెప్పారు. కానీ సమస్య ఏమిటంటే అతని కళ్ళకు రక్తాన్ని సరఫరా చేసే సిరలు ఎండిపోయి అతను మళ్ళీ చూడలేదు.

సైన్స్ ప్రకారం గర్భం దాల్చిన తర్వాత సృష్టించబడిన మొదటి భాగం బొడ్డు బటన్. అది బొడ్డు తీగ ద్వారా తల్లి మావికి కలుస్తుంది. మన బొడ్డు బటన్ ఖచ్చితంగా అద్భుతమైన విషయం. సైన్స్ ప్రకారం ఒక వ్యక్తి మరణించిన తర్వాత బొడ్డు బటన్ 3 గంటల పాటు వెచ్చగా ఉంటుంది.

మన సిరలన్నీ మన బొడ్డు బటన్‌తో అనుసంధానింపబడి ఉండటం వల్ల ఇది మన శరీరానికి కేంద్ర బిందువుగా మారుతుంది. "బొడ్డు బటన్ అంటే ప్రాణం అని అర్థం."

"Pechoti" బొడ్డు బటన్ వెనుక ఉంది. దానిపై 72,000 ప్లస్ సిరలు ఉన్నాయి. బొడ్డు బటన్‌కు నూనెను పూయడం వల్ల కళ్ళు పొడిబారటం, కంటి చూపు సరిగా లేకపోవడం, ప్యాంక్రియాస్‌పై లేదా కింద పని చేయడం, మడమలు, పెదవులు పగిలి పోవటం, ముఖం మెరిసిపోవటం, మెరిసే జుట్టు, మోకాళ్ళ నొప్పులు, వణుకు, నీరసం, కీళ్ళనొప్పులు, పొడిచర్మం వంటి వాటిని నయం చేస్తుంది.

రాత్రి పడుకొనే ముందు మీ బొడ్డు బటన్‌లో 3 చుక్కలు నెయ్యి లేదా కొబ్బరి నూనెను లేదా ఆముదం వేసినట్లయియితే... కళ్ళు పొడిబారడం, కంటి చూపు మందగించడం గోళ్ళలో ఫంగస్ నివారణ అవుతుంది.

మీ బొడ్డు బటన్‌లో నూనె ఎందుకు వేయాలి? మీ బొడ్డు బటన్ ఏ సిరలు ఎండిపోయాయో గుర్తించి, దానికి ఈ నూనెను పంపుతుంది.

ప్రయత్నించు, ప్రయత్నించడం వల్ల నష్టమేమీ లేదు. చాలా మంచి స్నేహితుడి నుండి అందుకున్న ఈ విలువైన, ఉపయోగకరమైన సమాచారాన్ని స్నేహితులతో పంచుకున్నందుకు సంతోషంగా ఉంది.

– ఎం. దివ్య
సైన్స్ ఉపాధ్యాయిని,
ఆక్స్‌ఫర్డ్ గ్రామర్ స్కూల్, హిమాయత్‌నగర్, హైదరాబాద్



# కలంచెలిమి



**పున్నం కీర్తన**

9వ తరగతి
జి.ప.ఉ.పా. ఒడిపిలవంచ,
మం. కాటారం,
జి. జయశంకర్ భూపాలపల్లి.



**జే. సాత్విక**

6వ తరగతి,
అరవింద హై స్కూల్
కుంచనపల్లి, గుంటూరు.



**ఎ. శివ తేజ**

10వ తరగతి ఇంగ్లీష్ మీడియం,
జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల
పాన్గల్ వనపర్తి జిల్లా



**ఆర్. సాయి నివేదిత**

7వ తరగతి,
జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల,
ఇందారం , మంచిర్యాల జిల్లా.



**ఇ. రక్షిత్**

7వ తరగతి,
అర్బన్ రెసిడెన్షియల్ స్కూల్, సిరిసిల్ల.




**షేక్ అంజుమ్**

9వ తరగతి
ప్రభుత్వ ఉన్నత పాఠశాల (ఉర్దూ)
కర్నూలు

కథ

# అసలు దెయ్యం



"మనూరి వెంకయ్య మామకు దెయ్యం పట్టిందంట్రా! పేట ఆస్పత్రికి తీస్క బోయిండ్రు" అప్పుడే తాత బండి దిగొచ్చిన రాంబాబు గబగబా వెళ్ళి పార్థు చెవిలో గుసగుసగా చెప్పాడు. "ఆ మర్రి చెట్టు ఎనకాల మామిడి తోపు కాయలింక మనకు లేనట్టేనా?" దిగులుగా అంటున్న పార్థును ఒక్క మొట్టు మొట్టి "ఒరేయ్! ఇల్లు గాలి ఓడేదుత్తుంటే సుట్ట కాల్నీకి నుప్పు గావాలన్నడంట" ఎనకటికెవడో అన్నట్టుంది.

"మర్రిచెట్టు కాడ కెళ్ళొద్దు,పైన దెయ్యముందనీ, పిచ్చి పిచ్చిగా కేకలు పెట్టుకుంటూ ఇంటికొచ్చి పడిపోయిండట." ఆ మాట చెవి కెక్కిన పార్థు ఆలోచనలో పడిపోయిండు. వెంకయ్య మావ ఆసుపత్రి కెళ్ళిన రొండో రోజు మరో వార్త ఊరంతా కుదిపేసింది. మామిడి తోపులో కాయలన్నీ దెయ్యాలు కోసుకొని పోతున్నయని. పిల్లలు, పెద్దలూ "బతికుంటే బలుసాకు తినైనా బతికొచ్చని" అనుకుంటున్నారు. ఇక పగటి పూట కూడా ఆ మర్రిచెట్టు వైపు కన్నెత్తి చూడలేదు మామిడి తోపు వైపు వెళ్ళడం లేదు. ఆ వూరి మామిడి తోపు యజమాని చంద్రయ్య ఇచ్చిన కంప్లైంట్ తో పోలీసులు రంగంలోకి దిగారు.

ఎంత మందిని ఎంక్వైరీ చేసినా ఒకటే మాట. "ఈ మధ్య అక్కడికి దెయ్యాలు వచ్చి చేరాయనీ, ఆ ప్రాంతంలో తిరుగుతూ జనాలను భయభ్రాంతులకు గురి చేస్తూ వున్నాయని".

"ఎన్నడూ లేనిది ఈ దెయ్యాల గొడవేమిటీ? దెయ్యాలు కూడా ఊరి ప్రయాణాలు చేస్తాయా? ఇదెక్కడి చోద్యంరా బాబూ!" పోలీసులకు ఎలాంటి క్లూ దొరక్క జుట్టు పీక్కున్నారు. రాత్రి పూట పది, పదకొండు గంటల దాకా ఆ ప్రాంతంలో పహారా తిరిగారు. వాళ్ళకు ఎలాంటి ఆనవాళ్లు దొరక్క ఊరి ప్రజలకు ధైర్యం చెప్పి పక్క ఊరిలో ఉన్న తమ పోలీసు స్టేషన్‌కు వెళ్ళిపోయారు.

* * *

దెయ్యాల ముచ్చట్లు రోజూ వింటున్నప్పటి నుండి రాంబాబు, పార్థులకు ఆ దెయ్యాల్ని చూడాలనే కోరిక అంతకంతకూ పెరిగిపోయింది.

ఓ రోజు రాత్రిపూట ధైర్యం చేసి ఇద్దరూ ఊరంతా సద్దు మనిగిన తర్వాత చేయి చేయీ పట్టుకొని మర్రి చెట్టు సమీపంలోకి చేరుకున్నారు.ఎదురుగా కనిపించేలా

ఓ బండ చాటున దాక్కుని ఆ దెయ్యాలు ఎప్పుడు కిందికి దిగుతాయా? అని చెట్టు వైపే చూడ సాగారు. ఆ దెయ్యాలకు బదులుగా ఓ ముగ్గురు చెట్టు కిందకు రావడం చూసి ఆశ్చర్య పోయారు. అవాక్కయ్యారు. వాళ్ళు మాట్లాడుకునే మాటలు చెవులు రిక్కించి వినసాగారు. "మొత్తానికి వెంకయ్యను ఈ చెట్టు కింద పడుకునేలా చేసి బెదరగొట్టాం. వెంకయ్యే కాదు ఇంకెవరూ ఈ దరిదాపుల్లోకి రాకుండా చేశాం. మామిడి చెట్లకున్న మొత్తం కాయల్ని అనుకున్న చోటికి చేర్చగలిగాం. మన లీడరు రేపు మనకు మాంచి మందు పార్టీ ఇస్తానన్నాడురోయ్. ఫుల్లుగా తాగి ఎంజాయ్ చేద్దాం." అని వాళ్ళు మాట్లాడిన మాటలన్నీ శ్రద్ధగా విన్నారు. "అసలు దెయ్యాలు ఎవరో తెలిసి పోయింది రోయ్" వాళ్ళ కంట పడకుండా పిల్లిలా నడుచుకుంటూ ఇళ్ళకు వచ్చేశారు.

***

పొద్దున్నే లేచి ఇద్దరూ ఏం చేయాలో అది చేసేశారు. పోలీసులు వాళ్ళ సాహసానికి ఆశ్చర్య పోయారు. తాము చేయలేని పనిని పిల్లలిద్దరూ చేసినందుకు అభినందించారు. వెంటనే రంగంలోకి దిగి దొంగలను పట్టుకున్నారు.

***

మరుసటి రోజు వాళ్ళ ఊరిలో రచ్చబండ దగ్గర పెద్ద ఎత్తున సమావేశం జరిగింది. పోలీసులు మామిడి కాయల దొంగలను పట్టుకొచ్చి వాళ్ళ ముందు నిలిపారు. వెంకయ్యకు అలా ఎందుకు అయ్యిందో చెప్పమని పార్థు, రాంబాబు వాళ్ళ వూరి బడిలో పాఠాలు చెప్పే సైన్స్ సారును పిలిపించారు. వెంకయ్యను చెట్టు కింద పడుకునేలా చేయడంతో ఆక్సిజన్ అందక గుండెల మీద ఎవరో కూర్చున్నట్లు అయి భయపడి పోయాడని, సైన్స్ తెలిసిన ఫలానా వ్యక్తే ఇలాంటి పనులు చేయించగలడని చెప్పేసరికి వూరి ప్రజలు ఆశ్చర్యంతో తెల్ల మొహం వేశారు. మామిడి కాయల దొంగలు తమ వెనుకుండి తోపంతా లూటీ చేయించిన వ్యక్తి పేరు చెప్పడంతో, అసలు దెయ్యం అతడేనని తెలిసి అందరిలో ఆవేశం పెల్లుబికింది. "మూఢంగా నమ్మినంత కాలం కొందరు స్వార్థంతో ఇలాంటి పనులు చేస్తూనే వుంటారనీ, పిల్లలూ పెద్దలూ సైన్స్‌కు సంబంధించిన విషయాలు తెలుసుకుంటే ఇలాంటి వారి ఆటలు సాగవు" అని చెప్పిన సైన్స్ సారు మాటలను అందరూ శ్రద్ధగా విన్నారు.

– పురిమళ్ల సునంద

ఖమ్మం
m : 94418 15722

చందదారులుగా చేరండి! బాల చెలిమి చందదారులను చేర్పించండి!

'ఎం.వేదకుమార్ సంపాదకత్వంలో వెలువడుతున్న 'బాల చెలిమి' పిల్లల మాసపత్రిక బాలబాలికలకు చేరడంలో తల్లిదండ్రుల, ఉపాధ్యాయ, పాఠశాల నిర్వహకుల, మేధావుల అమూల్య సహకారాన్ని కోరుతున్నాం. చందదారులుగా చేరడంతోపాటు తమకు తెలిసినవారిని చందదారులుగా చేర్పించాల్సిందిగా అభ్యర్థిస్తున్నాం.

**మా చిరునామా :**
Bala Chelimi
**"CHANDRAM"** 3-6-712/2,
St.No. 12, Himayatnagar
Hyderabad - 500 029.
Mob: 9030626288
E-mail:desk.chelimi@gmail.com,
www.balchelimi.com

**చందా వివరాలు :**

| | |
|---|---|
| విడి ప్రతి | : రూ. 40 |
| వార్షిక చందా | : రూ. 400 |
| 2 సం॥లకు | : రూ. 750 |

*'బాల చెలిమి' పేరిట నగదు, చెక్ లేదా ఆన్‌లైన్ రూపంలో చందామొత్తం చెల్లించవచ్చు.*

**Account Details :**

| | |
|---|---|
| Bank Name | : Canara Bank |
| A/C No. | : 30101010003714 |
| Branch | : Ashoknagar, HYDERABAD. |
| IFSC Code | : CNRB0013010 |

# MS Office ఎలా నేర్చుకోవచ్చు



**ఎలా నేర్చుకోవచ్చు:** 1. MS Word: డాక్యుమెంట్లను సృష్టించడం, ఫార్మాట్ చేయడం, ఎడిట్ చేయడం నేర్చుకోండి. స్పెల్ చెక్, ఫాంట్స్ ఇమేజెస్/టేబుల్స్ చేర్చడం వంటి ఫీచర్స్‌ను ఎక్స్‌ప్లోర్ చేయండి. 2. MS Excel: డేటాను ఎంటర్ చేయడం, సులభమైన ఫార్ములాలను ఉపయోగించడం, సింపుల్ చార్ట్స్‌ను సృష్టించడం మొదలుపెట్టండి. డేటాను సార్ట్ చేయడం, ఫిల్టర్ చేయడం వంటి ఫంక్షన్స్ నేర్చుకోండి. 3. MS PowerPoint: స్లైడ్లను సృష్టించడం, టెక్స్ట్, ఇమేజెస్, అనిమేషన్లు చేర్చడం నేర్చుకోండి. వేరే లేఅవుట్లు, ట్రాన్సిషన్స్‌తో ప్రెజెంటేషన్స్‌ను రూపొందించడం ప్రాక్టీస్ చేయండి.

**ప్రయోజనాలు:** MS Word: రిపోర్టులు, లెటర్స్, రెజ్యూమ్‌లు, డాక్యుమెంటేషన్ సృష్టించడానికి ఉపయోగకరంగా ఉంటుంది. MS Excel: డేటాను నిర్వహించడం, లెక్కలు చేయడం, రిపోర్టులు సృష్టించడం కోసం సహాయపడుతుంది. ఇది బడ్జెటింగ్, ప్రాజెక్ట్ ట్రాకింగ్ కోసం ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. MS PowerPoint: మీటింగ్స్, విద్యా కార్యక్రమాలు లేదా ఐడియాలను విజువల్‌గా షేర్ చేయడానికి ఆకర్షణీయమైన ప్రెజెంటేషన్స్ చేయడానికి ఉపయోగపడుతుంది. ఈ సాఫ్ట్‌వేర్లు వ్యక్తిగత, వృత్తిపరంగా ఉత్పాదకతను, సమర్థతను, కమ్యూనికేషన్‌ను మెరుగు పరుస్తాయి.

**అనువాదకులు MS Word, Excel, Power Point ఉపయోగించడంలో సాధారణ ప్రజలకు ఎలా సహాయపడతారు:** అనువాదకులు MS Word, Excel, మరియు PowerPoint వంటి సాఫ్ట్‌వేర్లను ఆంగ్ల భాష లేదా ఇతర భాషల్లో ప్రావీణ్యం లేని వ్యక్తులకు మరింత అందుబాటులోకి తీసుకురావడంలో కీలక పాత్ర పోషిస్తారు. వారు ఇలా సహాయం చేస్తారు: **1. ఫీచర్లను అర్థం చేసుకోవడం:** అనువాదకులు మెనూలు, టూల్స్, ఇన్‌స్ట్రక్షన్లను వాడుకరుల స్థానిక భాషలోకి మార్చి, సాఫ్ట్‌వేర్‌ను ఎలా ఉపయోగించాలో అర్థం చేసుకోవడం సులభం చేస్తారు. **2. నిర్దేశిత అధ్యయనం:** అనువాదకులు వివిధ భాషలలో నేర్చుకునే వనరులు, ట్యుటోరియల్స్, గైడ్లను తయారు చేయడంలో సహాయపడతారు, దీనివల్ల భాషా అడ్డంకులేమీ లేకుండా MS Office టూల్స్ నేర్చుకోవడం సాధ్యమవుతుంది. **3. డాక్యుమెంట్ అనువాదం:** డాక్యుమెంట్లు, స్ప్రెడ్‌షీట్లు, ప్రెజెంటేషన్లను అనువదించడంలో వాడుకరులకు అనువాదకులు సహాయం చేయగలరు, వారి ఇష్టమైన భాషలో కంటెంట్ సృష్టించడంలో తోడ్పడతారు. **4. సాంస్కృతిక ఆవరణలో కమ్యూనికేషన్:** కంటెంట్‌ను అనువదించడం ద్వారా, వేరే భాషల్లో ఉన్నవారితో సహకరించడం, పని షేర్ చేయడం సులభమవుతుంది, తద్వారా కమ్యూనికేషన్, ఉత్పాదకత మెరుగవుతుంది. మొత్తంగా, అనువాదకులు భాషా అడ్డంకులను తొలగించి, సాధారణ ప్రజలు MS Word, Excel, PowerPointను సమర్థవంతంగా ఉపయోగించడంలో సహాయపడతారు.

**– బాలచెలిమి డెస్క్**

# తెలంగాణ సారస్వత పరిషత్తు నిర్వహిస్తున్న బాలల సాంస్కృతికోత్సవం

తెలంగాణ సారస్వత పరిషత్తు త్వరలో హైదరాబాదులో బాలల సాంస్కృతికోత్సవం నిర్వహిస్తుంది. రెండు తెలుగు రాష్ట్రాల నుంచి 6 నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులు పాల్గొనవచ్చు. వివిధ అంశాల్లో పోటీలు, సృజనాత్మక రచన అధ్యయన శిబిరాలు జరుగుతాయి. రాష్ట్ర, జాతీయ స్థాయిలో ప్రతిష్ఠాత్మక పురస్కారాలు అందుకున్న బాల మేధావులు తమ అనుభవాలు పంచుకుని తోటి విద్యార్థులకు ప్రేరణ కలిగిస్తారు. పోటీలు రెండు రకాలుగా జరుగుతాయి. ఒకటి: విద్యార్థులు తమ గ్రామాల నుంచే రాసి పోటీకి పంపవచ్చు.రెండు పేజీలకు మించకుండా కథ, 20 పంక్తులకు మించకుండా ఏదేని అంశంపై వచన కవిత, ఐదు పద్యాలకు మించకుండా పద్య కవితా, చిత్రలేఖనం గీసి తెలంగాణ సారస్వత పరిషత్తు, తిలక్ రోడ్డు, ఆబిడ్స్, హైదరాబాద్ పంపవచ్చు. రెండు: ఉత్సవం రోజున కూడా అప్పటికప్పుడు పోటీలుంటాయి. మేకప్ లేకుండా ఏకపాత్రాభినయ పోటీ, దేశభక్తి, లలిత గీతాలాపన పోటీ, వ్యాసరచన, వక్తృత్వం, పుస్తక సమీక్ష పోటీలు ఉంటాయి. విజేతలకు నగదు బహుమతితో పాటు ప్రశంసా పత్రం అందజేస్తారు. తమ పేరు, తరగతి, పాఠశాల, ఊరి పేరు ఇతర వివరాలను **9603727234** వాట్సాప్ నెంబర్‌కు పంపాలి. ప్రతినిధులుగా, పోటీల్లో పాల్గొనేవారు అక్టోబర్ 10వ తేదీలోగా తమ పేర్లు నమోదు చేసుకోవాలని పరిషత్తు ప్రధాన కార్యదర్శి డాక్టర్ జె. చెన్నయ్య ఒక ప్రకటనలో తెలిపారు.



## బంగ్లాపై భారత్ భారీ విజయం....

# 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' - అశ్విన్






22.9.2024 చెన్నైలోని చెపాక్ వేదికగా బంగ్లాదేశ్‌తో జరిగిన తొలి టెస్టులో భారత్ భారీ విజయం సొంతం చేసుకుంది. టీమ్ఇండియా 280 పరుగుల తేడాతో గెలిచి రెండు టెస్టు సిరీస్‌లలో 1-0 ఆధిక్యం సాధించింది. తొలి ఇన్నింగ్స్‌లో సెంచరీ చేసిన రవిచంద్రన్ అశ్విన్.. రెండో ఇన్నింగ్స్‌లో ఆరు వికెట్లు (6/88) తీయగా అశ్విన్‌కు తోడుగా స్పిన్నర్ రవీంద్ర జడేజా (3/58) రాణించడంతో 515 పరుగుల ఛేదనలో బంగ్లా జట్టు 234 పరుగులకే ఆలౌట్ అయి భారీ పరాభవాన్ని మూటగట్టుకుంది. బంగ్లా జట్టు సారథి నజ్ముల్ హొసేన్ శాంతో (82) పోరాడినా ఓటమి తప్పలేదు. అశ్విన్, జడ్డూ కలిసి 10 ఓవర్లలోనే మ్యాచ్‌ను ముగించారు. మ్యాచ్‌లో ఆల్‌రౌండ్ షో తో అదరగొట్టిన రవిచంద్రన్ అశ్విన్‌కు 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు దక్కింది. రెండుసార్లూ ఒకే వేదికపై (టెస్టులలో) సెంచరీ చేసి ఐదు వికెట్లు తీసిన మొదటి ఆటగాడు అశ్విన్. ఒక టెస్టులో శతకంతో పాటు 'ఫైఫర్' సాధించిన ఆటగాళ్లలో ఇయాన్ బోథమ్ (5) తర్వాత రెండో స్థానంలో అశ్విన్ (4) నిలిచాడు. టెస్టులలో అత్యధిక సార్లు (37) ఐదు వికెట్ల ఘనత సాధించిన రెండో బౌలర్. ఈ జాబితాలో ముత్తయ్య మురళీధరన్ (67) అందరికంటే ముందున్నాడు. టెస్టులలో అత్యధిక వికెట్లు (522) తీసిన బౌలర్లలో అశ్విన్ 8వ స్థానం.

తొలి టెస్టుకు ఎంపిక చేసిన భారత జట్టు సభ్యులనే రెండో టెస్టులోనూ కొనసాగిస్తున్నట్లు బీసీసీఐ తెలిపింది. రెండో టెస్టు ఈనెల 27 నుంచి కాన్పూర్ వేదికగా జరుగనుంది. భారత జట్టు: రోహిత్ శర్మ (కెప్టెన్), యశస్వీ జైస్వాల్, శుభ్‌మన్ గిల్, విరాట్ కోహ్లీ, కెఎల్ రాహుల్, సర్ఫరాజ్ ఖాన్, రిషభ్ పంత్ (వికెట్ కీపర్), ధ్రువ్ జురెల్, రవిచంద్రన్ అశ్విన్, రవీంద్ర జడేజా, అక్షర్ పటేల్, కుల్‌దీప్ యాదవ్, మహ్మద్ సిరాజ్, ఆకాశ్ దీప్, జస్‌ప్రీత్ బుమ్రా, యశ్ దయాల్.

**– ఓజీఎస్ స్పోర్ట్స్ అకాడమీ**
హైదరాబాద్

# రియల్ లీడర్...



ఇద్దరు కుమార్తెలు "మహి" మరియు "ప్రియాంక" తమ తండ్రి పని చేసే ప్రదేశానికి వెళ్లాలని కోరుకున్నారు. తన కుమార్తెల కోరికలను నెరవేర్చడానికి, అతను వారిని తన పని ప్రదేశం, సుప్రీంకోర్టుకు తీసుకెళ్లాడు. ఇద్దరు కుమార్తెలు తమ తండ్రి పని చేసే ప్రదేశాన్ని సందర్శించి ఆనందంలో మునిగిపోయారు. వారి ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. వారి తండ్రి సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి గౌరవనీయులైన డి వై. చంద్రచూడ్ & తల్లి శ్రీమతి కల్పనా చంద్రచూడ్. ఇద్దరు కుమార్తెలు చక్రాల కుర్చీలో కూర్చున్నారు. సుప్రీంకోర్టు కాంప్లెక్స్‌లో తీసిన చిత్రం. మహి, ప్రియాంక ఇద్దరూ భిన్నాభిప్రాయాలు గల వ్యక్తులు. వీల్ చైర్ లేకుండా నడవలేరు. అంతే కాకుండా, ఇద్దరూ చంద్రచూడ్ దంపతులకు దత్తపుత్రికలు.

"జీవనంలో నిరాడంబరత్వం, ఆచరణలో గొప్పతనం, దివ్యాంగులను చేరదీయడం, వారిని తమ కుటుంబ సభ్యులుగా చేసుకోవడం అత్యున్నత, అభ్యుదయభావాలు గల వ్యక్తులకు మాత్రమే సాధ్యం." గౌరవనీయులైన భారత ప్రధాన న్యాయమూర్తి దంపతులకు వందనం.

ఇద్దరు మానసిక వికలాంగులైన బాలికలను దత్తత తీసుకొని, వారికి కొత్త జీవితాన్ని ప్రసాదించి, దివ్యాంగులకు పునరావాసం కల్పించడంలో దేశంలోనే నూతన ఒరవడికి శ్రీకారంచుట్టిన సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ శ్రీ వైవి. చంద్రచూడ్ గారు... మీరు సార్ ఈ దేశానికి నిజమైన హీరో, ఆదర్శ అత్యున్నత సర్వోన్నతాధికారి.

రియల్ లీడర్... హ్యాట్సాఫ్ ??


– రిసోర్స్ గూగుల్

# బాలచెలిమి పత్రికపై జియో ఎక్స్‌పర్ట్ అభిప్రాయం

నేను ఇటీవల బాల చెలిమి పత్రిక చదివాను, అందులో అన్ని వ్యాసాలు ఆకర్షణీయంగా ఉన్నాయి. నేను మొదట రెండు వ్యాసాలను చదివాను: ఒకటి బొర్రా గుహల గురించి, మరొకటి వావిలాల గోపాలకృష్ణయ్య గురించి. రెండవ వ్యాసం నాకు ఐదేళ్ళప్పుడు నా జ్ఞాపకాలను పునరుజ్జీవితమిచ్చింది. మా నాన్న పరిగి నుంచి ఎమ్మెల్యేగా ఉన్నారు. మేము పాత ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో ఉండేవాళ్ళం. ఒక వైపు వావిలాల గోపాలకృష్ణయ్య గారి క్వార్టర్, మరో వైపు మూర్తి రాజు గారి క్వార్టర్ (uncle of actor Krishnam Raju, అతడు సినిమా కోసం ప్రయత్నిస్తూ ఉండేవాడు). వావిలాల గోపాల కృష్ణయ్య, నాన్నగారితో బాగా పరిచయమున్నాడు. వారిద్దరూ నిజమైన గాంధీయిలుగా ఉన్నారు. ఆయన మా ఇంటికి తరచుగా రావటం జరిగేది.

కమతం మహేందర్ రెడ్డి

డైరెక్టర్, (రిటైర్డ్), జిఎస్ఐ, ఇండియా



# అంతర్జాతీయ, జాతీయ దినోత్సవాలు

ప్ర : జాతీయ గణతంత్ర దినోత్సవం ఎప్పుడు?
**జ : 26 జనవరి**
ప్ర : ప్రపంచ జనసంఖ్య దినోత్సవం ఎప్పుడు?
**జ : 11 జనవరి**
ప్ర : ప్రపంచ ఆర్థిక అభివృద్ధి దినోత్సవం ఎప్పుడు?
**జ : 30 జనవరి**
ప్ర : అంతర్జాతీయ హెూమెూఫోబియా వ్యతిరేక దినోత్సవం ఎప్పుడు?
**జ : 17 జనవరి**
ప్ర : ప్రపంచ న్యాయ దినోత్సవం ఎప్పుడు?
**జ : 1 ఫిబ్రవరి**
ప్ర : జాతీయ అంతర్జాతీయ విద్య దినోత్సవం ఎప్పుడు?
**జ : 2 ఫిబ్రవరి**
ప్ర : ప్రపంచ మానవ హక్కుల దినోత్సవం ఎప్పుడు?
**జ : 20 ఫిబ్రవరి**
ప్ర : ప్రపంచ పర్యావరణ దినోత్సవం ఎప్పుడు?
**జ : 28 ఫిబ్రవరి**
ప్ర : ప్రపంచ మహిళా దినోత్సవం ఎప్పుడు?
**జ : 8 మార్చి**
ప్ర : ప్రపంచ ఆరోగ్య దినోత్సవం ఎప్పుడు?
**జ : 24 మార్చి**
ప్ర : ప్రపంచ నీటి దినోత్సవం ఎప్పుడు?
**జ : 22 మార్చి**
ప్ర : ప్రపంచ వాతావరణ దినోత్సవం ఎప్పుడు?
**జ : 23 మార్చి**
ప్ర : ప్రపంచ ప్రసవ దినోత్సవం ఎప్పుడు?
**జ : 30 ఏప్రిల్**
ప్ర : ప్రపంచ కార్మిక దినోత్సవం ఎప్పుడు?
**జ : 1 మే**
ప్ర : ప్రపంచ ఎయిర్ క్వాలిటీ దినోత్సవం ఎప్పుడు?
**జ : 7 మే**
ప్ర : ప్రపంచ ఆహార దినోత్సవం ఎప్పుడు?
**జ : 28 మే**
ప్ర : జాతీయ సాహిత్య దినోత్సవం ఎప్పుడు?
**జ : 1 జులై**
ప్ర : అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవం ఎప్పుడు?
**జ : 27 జులై**



ప్ర : జాతీయ స్వాతంత్ర్య దినోత్సవం ఎప్పుడు?
**జ : 15 ఆగస్ట్**
ప్ర : ప్రపంచ యువత దినోత్సవం ఎప్పుడు?
**జ : 12 ఆగస్ట్**
ప్ర : ప్రపంచ శాంతి దినోత్సవం ఎప్పుడు?
**జ : 21 ఆగస్ట్**
ప్ర : ప్రపంచ వైద్య దినోత్సవం ఎప్పుడు?
**జ : 1 ఆగస్ట్**
ప్ర : ప్రపంచ వినోద దినోత్సవం ఎప్పుడు?
**జ : 1 సెప్టెంబర్**
ప్ర : ప్రపంచ అక్షరాస్యత దినోత్సవం ఎప్పుడు?
**జ : 8 సెప్టెంబర్**
ప్ర : జాతీయ సార్వత్రిక ఆరోగ్య దినోత్సవం ఎప్పుడు?
**జ : 14 నవంబర్**
ప్ర : ప్రపంచ నిద్ర దినోత్సవం ఎప్పుడు?
**జ : 16 డిసెంబర్**

– సచిన్ కోత్వాల్
బాలచెలిమి

చిల్డ్రన్స్ ఎడ్యుకేషనల్ అకాడమీ హైదరాబాద్ (Regd. 720/1982)

# బాలచెలిమి గ్రంథాలయం

## బాలచెలిమి గ్రంథాలయంపై సమీక్ష

గ్రంథాలయాలు విజ్ఞాన మందిరాలు, వినోద, వికాస కేంద్రాలు. అవి అందించే జ్ఞానం విశేషమైనది. విస్తృతమైనవి. చిన్ననాటి నుండే పఠనాసక్తి పెంపొందిస్తూ భాషా, సాహిత్యాల పట్ల అభిరుచి, ఆసక్తి కలిగింప జేయడానికి పుస్తకాలు అవసరం. ఒక పుస్తకం గొప్ప స్నేహితుడులాంటిది. అందరికీ అన్ని పుస్తకాలు అందుబాటులో ఉండవు కనుక, పిల్లల కోసం చిల్డ్రన్స్ ఎడ్యుకేషన్ అకాడమీ, హైదరాబాద్ మణికొండ వేదకుమార్ గారు తెలంగాణ రాష్ట్రంలో మొదటగా 33 'బాలచెలిమి' గ్రంథాలయాల ఏర్పాటుకు ప్రణాళిక సిద్ధం చేసుకుని, మొదటగా 2019 సంవత్సరంలో భూదాన్ పోచంపల్లిలో తొలతగా ప్రారంభించి, ఆ తర్వాత తడపాకల, జల్లేపల్లి, రంగాపూర్, నందిమేడారం, దేవరకొండ జువనైల్ హోమ్, వరంగలు ప్రాంతాల్లో ఏడు బాలచెలిమి గ్రంథాలయాలు ప్రారంభించడం వలన మంచి ఫలితాలు వచ్చాయి. పిల్లలు గ్రంథాలయ వినియోగంతో పాటు సృజనాత్మక రంగంలో పలు సంకలనాలు కథ, కవితలు వెలువడినవి. కరోనా వల్ల అంతరాయం కలిగిన 2023 అక్టోబర్ నెలలో కుకునూరుపల్లి, ఆర్ & ఆర్ కాలనీ గజ్వేల్, లింగరాజుపేటలు బాలచెలిమి గ్రంథాలయాలు ప్రారంభించబడ్డాయి. ప్రతి గ్రంథాలయానికి విలువైన బాలసాహిత్య వినోద, విజ్ఞాన, వికాస గ్రంథాలు అందించడంతో పాటు, బాలబాట, చంపక్, నాని, బాలభారతం, చెకుముకి వంటి పత్రికలతో పాట చిల్డ్రన్స్ ఎడ్యుకేషన్ అకాడమీ ద్వారా తెలంగాణ బడిపిల్లలు రాసిన కథా సంకలనాలు, పెద్దలు రాసిన కథా సంకలనాలు, పర్యావరణ కథల సంకలనాలు వెంట వెంట అందిచటమే కాక ఇతర బాల సాహిత్య గ్రంథాలు పంపడం వలన పఠనాసక్తి, గ్రంథాలయ వినియోగం పెరగడానికి ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు ఎంతగానో సహకరిస్తున్నారు. వారికి ధన్యవాదాలు. బాలచెలిమి గ్రంథాలయాలు లేని ప్రాంతాల్లో సైతం కోరగానే వారికి విలువైన పుస్తకాలు పంపించడం జరిగింది. ఇప్పటి వరకు 10 గ్రంథాలయాలు విజయవంతంగా నిర్వహించడం, మంచి ఫలితాలు రావడం వలన 2024 అక్టోబర్ నెలలో, ఇచ్చోడ (ఆదిలాబాద్), రాయపోల్ (సిద్ధిపేట), హవేలి ఘనపూర్ (మెదక్), పానగల్ (వనపర్తి), సిరిసిల్లా 5 బాలచెలిమి గ్రంథాలయాలను ప్రారంభించు కుంటున్నాం. కేవలం గ్రంథాలే కాకుండా, 'బాలచెలిమి క్లబ్' విద్యార్థులచే ఏర్పాటు చేసి వివిధ రకాల పోటీలు, కార్యక్రమాలు, బహుమతులు అందిచనైనది. అంచెలంచెలుగా మరిన్ని బాలచెలిమి గ్రంథాలయాలను ఏర్పాటు చేయడమంటే, బాలబాలికల, విజ్ఞాన వినోదాలు, వికాసాలు అంచెలంచెలుగా ఎదగడం కోసం. ఇందులో భాగంగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కుకునూరుపల్లి, జల్లెపల్లి బాలచెలిమి కారుల అభిప్రాయాలు, కథనాలు మీకోసం.

**– గరిపల్లి అశోక్**

కన్వీనర్, బాలచెలిమి గ్రంథాలయం, హైదరాబాద్

## ఆక్స్‌ఫర్డ్ స్కూలు పూర్వ విద్యార్థి ఔదార్యం



విజ్ఞానం, వినోదంతో పాటు వికాసం కల్గించేలా బాలచెలిమి పత్రిక ఉందని, చిన్నప్పటి నుండి పుస్తక పఠనం పట్ల ఆసక్తి కలిగించాలని, దాని ద్వారా విద్యార్థుల్లో మానసిక ధైర్యం, స్థైర్యం కలుగుతుందని, ఉత్తమ పౌరులుగా ఎదుగుతారని ఆక్స్‌ఫర్డ్ స్కూల్ పూర్వ విద్యార్థి. శంకర్స్ పీపుల్స్ హాస్పిటల్ ఆర్టిసి క్రాస్‌రోడు, హైదరాబాదు వైద్యులు డా॥ అర్చన, గరిపల్లి అశోక్ గారితో అన్నారు. తనవంతు బాధ్యతగా తన సొంత ఊరైన ముస్తాబాద్, గంభీరావుపేట మండలాలలో సుమారు 30కు పైగా పాఠశాలలకు బాలచెలిమి పత్రిక కోసం రూ. 12,000/- చందా చెల్లించారు. వీరిని ప్రముఖ వైద్యులు డా॥ చింతోజు శంకర్, డా॥ అశ్విన్, డా॥ తేజస్వి, డా॥ అఖిల, డా॥ రాజారాం, నారాయణలు అభినందించారు.


## విశాల లలిత – కౌమార బాలల సైన్స్ ఫిక్షన్ నవలల పోటీ ఫలితాలు"



ఈ రోజు (14.09.24) సిరిసిల్లలో రంగినేని ట్రస్ట్ ప్రాంగణంలో జరిగిన ఓ ప్రత్యేక కార్యక్రమంలో "విశాల లలిత – కౌమార బాలల సైన్స్ ఫిక్షన్ నవలల పోటీ ఫలితాలు" ప్రకటించారు. ప్రముఖ రచయిత, కవి, దాశరథి అవార్డు గ్రహీత జూకంటి జగన్నాథం, కేంద్ర సాహిత్య అకాడమీ బాల సాహిత్య అవార్డు గ్రహీత డా. పత్తిపాక మోహన్ ఈ ఫలితాలను ప్రకటించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ రచయితలు పెద్దింటి అశోక్ కుమార్, బివిఎన్ స్వామి, బొజ్జారపు రవీందర్, మద్దికుంట లక్ష్మణ్, బుర్ర తిరుపతి, పిన్నంశెట్టి కిషన్, గరిపెల్లి అశోక్ మరికొందరు సాహిత్యవేత్తలు పాల్గొన్నారు. జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా నిర్వహించిన పోటీ – 2024 ఫలితాలు: విశాల లలితమ్మ స్మృతిలో జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా నిర్వహించిన కౌమార బాలల సైన్స్ ఫిక్షన్ నవలల పోటీలో పదివేల రూపాయల బహుమతికి ఎంపికైన రెండు నవలలు. 1. చంద్రునికో నూలుపోగు. (పదివేల రూపాయలు.) రచయిత సయ్యద్ సలీం. మల్లాపూర్, హైదరాబాద్. 2. స్పెక్ట్రాన్ ప్యాలెస్. (పదివేల రూపాయలు.) రచయిత సరికొండ రవీంద్రనాథ్. సైనిక్ పురి, హైదరాబాద్. ఈ కౌమార బాలల నవలల పోటీకి రెండు తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా తమిళనాడు, అమెరికా నుంచి కూడా రచయితలు తమ రచనలు పంపించారు. మా ఈ ప్రయత్నానికి సహకరించి, ప్రోత్సహిస్తూ తమ రచనలు పంపిన ఆ రచయితలందరికీ పేరు పేరునా మా హృదయ పూర్వక కృతజ్ఞతలు! తమ అమూల్యమైన సమయం ఇచ్చి, ఈ నవలల్ని క్షుణ్ణంగా చదివి, వీటిలోంచి బహుమతి కోసం రెండు నవలల్ని ఎంపిక చేయడానికి తోడ్పడిన గౌరవ న్యాయనిర్ణేతలు. వి.శాంతి ప్రబోధ, పి.భాగ్యలక్ష్మి గారు మంచి పుస్తకం రెండు దశాబ్దాలుగా నిర్వహిస్తూ, 'తానా–మంచి పుస్తకం' వారు నిర్వహిస్తున్న బాలల కథల, నవలల పోటీల నిర్వాహక వర్గంలో ఉన్నవారు. డా.ఏ. విజయలక్ష్మి గారు జహీరాబాద్ కేంద్రంలో పిల్లలకోసం 'మన లైబ్రరీ' నిర్వహిస్తూ, ప్రతి సంవత్సరం బాలల కోసం పిల్లల సమ్మర్ క్యాంపులూ, బాలల పండుగలూ నిర్వహిస్తున్నవారు. పిల్లలు రాసిన రచనలతో జహీరాబాద్ పిల్లల కథలు ప్రతియేటా ప్రచురిస్తున్న వారు, వైద్యులు. వీరందరికీ మా హృదయపూర్వక కృతజ్ఞతలు తెలుపు కుంటున్నాం. ఈ రచయితలకు బహుమతి పురస్కారాలను త్వరలో జరిపే కార్యక్రమంలో అందజేస్తాం.

బాలచెలిమి డెస్క్

True story of life





# మోక్షగుండం విశ్వేశ్వరయ్య

## (మోక్షగుండం గ్రామం, కర్నూలు జిల్లా తెలుగు బిడ్డ)

మన దేశంలో ఇంజనీర్స్ డే ని ప్రఖ్యాత సివిల్ ఇంజనీర్ అయినటువంటి శ్రీ మోక్షగుండం విశ్వేశ్వరయ్య గారి పుట్టినరోజునాడు జరుపుకుంటాం ఇపుడు ఆయన గురించి తెలుసుకుందాం కాస్త ఓపికగా చదవండి.

భారతదేశంలోని ప్రఖ్యాత ఇంజనీరు అయిన శ్రీ మోక్షగుండం విశ్వేశ్వరయ్య గారిని గురించి తెలుసు కోవాల్సిన ఆసక్తికరమైన విషయాలను కొన్నిటిని తెలుసుకుందాం! ఈయన భారతదేశంలోనే కాకుండా ప్రపంచ ప్రఖ్యాత ఇంజనీర్లలో అతి ముఖ్యుడు. వీరి అసలు పేరు విశ్వేశ్వరాయ. కానీ వారిని అందరూ విశ్వేశ్వరయ్య అని ప్రేమగా పిలిచేవారు. ఈయన, 15-09-1860న, శ్రీనివాస శాస్త్రి, వెంకాయమ్మ అనే పుణ్య దంపతులకు, నేటి కర్ణాటక రాష్ట్రంలోని, బెంగుళూరు సమీపంలోని ముద్దినేహల్లి అనే కుగ్రామంలో జన్మించారు. వీరిది అతి పేదకుటుంబం. వీరి పూర్వీకులు కర్నూలు జిల్లాలోని 'మోక్షగుండం' గ్రామానికి చెందినవారు. ఉదర పోషణార్థం, వారు కర్ణాటకలోని మైసూరు ప్రాంతానికి వలస వెళ్ళారు. విశ్వేశ్వరయ్యగారు తల్లి సంరక్షణలో విద్యాబుద్ధులు పొందటమే కాకుండా క్రమశిక్షణ కూడా అలవాటు చేసుకున్నారు. ఆయన బాల్యంలోనే వారి కుటుంబం చిక్ బళ్ళాపూరుకి మకాం మార్చింది. అయన ప్రాధమిక విద్య చిక్ బళ్ళాపూరులోనే జరిగింది. ఉపాధ్యాయులు అతని ప్రతిభను గుర్తించి, అతని మీద ప్రత్యేక శ్రద్ధ తీసుకునే వారు. వీరికి గణిత శాస్త్రమంటే ఎక్కువ మక్కువ. ఈ విషయాన్ని గ్రహించి శ్రీ నాదముని నాయుడు గారు అనే ఉపాధ్యాయుడు ఇతనికి గణిత శాస్త్రంలో బాగా తర్ఫీదునిచ్చి, ప్రవీణుడిని చేసారు. అదృష్టవశాత్తు మైసూరు మహారాజా వారి దృష్టిలో పడ్డారు. రాజావారి ఆర్థిక సహాయంతో పూనాలో ఇంజనీరింగ్ విద్యను పూర్తిచేసారు. ఇంజనీరింగ్ విద్యను విజయవంతంగా పూర్తి చేసుకున్న తరువాత, మొదటిసారిగా బొంబాయిలో ప్రభుత్వ ఉద్యోగిగా చేరారు. ఆ సమయంలో వీరు బొంబాయిని ఒక సుందర నగరంగా తీర్చిదిద్దారు. 1908లో నిజాం నవాబు ఆహ్వానం మేరకు, నిజాం ప్రభుత్వంలో ఇంజనీరుగా చేరి పలు రిజర్వాయులను నిర్మించటమే కాకుండా, హైదరాబాద్‌ను ఒక సుందర నగరంగా తీర్చిదిద్దారు. నిజాం నవాబు వీరి మేధస్సును గుర్తించి 1912లో దివాన్‌గా పదోన్నతిని కల్పించారు. విశాఖపట్నం రేవును సముద్రపు కోత నుండి రక్షించే వ్యవస్థను రూపొందిం చడంలో కూడా ఆయన పాత్ర ఉంది. రోజుకు 18 గంటలు పని చేయటం ఆయనకు నిత్యకృత్యం. ఈ క్రమశిక్షణ, పట్టుదల, నీతీ నిజాయితీలే ఆయనను ప్రఖ్యాత వ్యక్తిగా తీర్చిదిద్దాయి అనటంలో ఏమాత్రం సందేహం లేదు.



నేటి కర్ణాటక రాష్ట్రంలోని కృష్ణరాజ సాగర్ డ్యాం, బృందావన్ గార్డెన్స్, మైసూరు విశ్వవిద్యాలయం మొదలగునవి ఆయన కృషి వలెనే సాధ్యపడ్డాయి. 1955 లో భారత ప్రభుత్వం ఆయనను 'భారతరత్న' బిరుదుతో సత్కరించింది. ప్రాంతీయ బేధాలను పట్టించు కోకుండా భారత దేశానికి అనితర సేవలందించిన ఈ మహనీయుడు, తన శతజయంతి ఉత్సవాలను పూర్తి చేసుకొని, 12-04-1962న స్వర్గస్తులయ్యారు.

ఆయన పుట్టిన రోజును 'ఇంజనీర్స్ డే!' గా జరుపు కోవటం ఒక ఆనవాయితీగా వస్తుంది. పనిని, కర్తవ్యాన్ని బాధ్యతగా భావించే శ్రీ విశ్వేశ్వరయ్య గారి జీవిత చరిత్ర మన అందరికీ ఆదర్శనీయం! ఆచరణీయం!!

నీతీనిజాయితీలతో, క్రమశిక్షణతో పని చేయటమే ఆయనకు మనమిచ్చుకునే నివాళి!

– సువేగా


Oxford
Grammar High School
KNOWLEDGE IS POWER
ogs
JUNIORS
grow naturally
43rd
YEARS OF
MERITORIOUS
PERFORMANCE
We make school time the best time for your kids
At OGS Juniors, all the children are given a warm, safe, and stimulating environment so that they can grow to become individuals while exploring, imagining, creating, and playing.
• Loving atmosphere & play ground
• CCTV surveillance
• Certified teachers & caring staff
• Kids zone & play area
• Interactive & Value based Learning
CARING TEACHERS & STAFF
Your child will get the best care and attention
ECO-FRIENDLY PRACTICES
We let the children play with nature friendly material
HUGE PLAYGROUND
Your child will get lots of fresh air and playtime
INTERACTIVE LEARNING
Our trusted method helps your child communicate and learn with ease.
Street No. 13, Himayathnagar, Hyderabad | Ph : 040 2763 6214, 99590 20512

BALA CHELIMI, Telugu Children's Monthly Magazine
Date of Publication - 23rd September, 2024
Postal Dates: 24th & 26th Every Month

RNI Regn. No. 52828/92 TC No. TEL Tel01232
Postal Regn.No.HCD-5022/2024-2026




Edited, printed, published and owned by Manikonda Vedakumar,
Printed at Deccan Press, H.No.1-9-1126/B, Azamabad, Musheerabad, Hyderabad-500020, Telangana State.
Published at "CHANDRAM", # 3-6-712/2, 12th Street, Himayatnagar, Hyderabad-500029, Telangana.
Editor: Manikonda Vedakumar. RNI Reg No. 52828/92, Tc No: TEL Tel01232.
Cell : 9030626288, Mail ID : edit.chelimi@gmail.com